ఆదివారం
ప్రజాశక్తి
ఫిబ్రవరి 27, 2005

27-2-2005
Entered

రంగురంగుల
మొఘల్-ఎ-ఆజం

హ్యాపీ బర్త్‌డే

(27-2-2005నుండి 5-3-2005వరకు)

ప్రియాంక
8సం॥, 27.2.1997
తిరుమల-రాధాకృష్ణ
ముంచింగిపుట్ట-విశాఖ

మౌనిక
8సం॥, 27.2.1997
తిరుమల-రాధాకృష్ణ
ముంచింగిపుట్ట-విశాఖ

కౌసల్య
4 సం॥ 27-2-2001
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు

మనోజ్‌కుమార్ రెడ్డి
2సం॥, 27.2.2003
లక్ష్మీకాంతం-నాగభూషణరెడ్డి
తిమ్మారెడ్డిపల్లి-కడప

హుమేరా ఫాతిమా
6సం॥, 27.2.1999
నిజామున్నిసా-నన్నేఖాన్
రాయమాధారం

ప్రజ్ఞ
28.2.2001
నిర్మల-మంగపతిరావు
అజయతండ-ఖమ్మం

వికాస్-వినీల
1సం॥, 28.2.2004
సునీత-సత్యం
మర్రిగూడ-నల్లగొండ

జస్వంతకృష్ణ
10సం॥, ఫిబ్రవరి-1995
ధాన్యలక్ష్మి-హరిబాబు
ఇందిరాగాంధినగర్-నెల్లూరు

అఖిలేష్
షీలా-మిలిన్‌కుమార్
ఆదోని-కర్నూలు

శిరీషాచారి
1సం॥, ఫిబ్రవరి-2004
రమాదేవి-బాల్‌రాజ్
పరిగి-రంగారెడ్డి

ఎహ్‌సానుల్ అమీర్
3సం॥, ఫిబ్రవరి-2002
జాకిరా-జావేద్‌అలి
మహబూబ్‌నగర్

గాయత్రి
1సం॥, ఫిబ్రవరి-2002
లలిత-అంజి
చెన్నేకొత్తపల్లి-అనంతపురం

సోనూ
మార్చి-2
షమీమ్-పంచ్
ఖమ్మం

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ వివరణాత్మకం

13వ తేదీ ఆదివారం అనుబంధం కవర్‌స్టోరీగా రాసిన అంశం బాగుంది. వాలెంటైన్స్ డే వస్తుందంటే అటు ప్రేమికులలోనూ తెలియని ఆనందం. ఇటు వ్యాపారవర్గాల్లోనూ చెప్పలేని సంతోషం. స్వార్థం పేరుకుపోతున్న నేటి సమాజంలో ప్రేమను కలుషితం కాకుండా చూడాల్సివుంది. వాలెంటైన్స్‌డే పుట్టుపూర్వోత్తరాలు గురించి తెలియజేసిన ప్రజాశక్తికి ధన్యవాదాలు.

-శైలజా సనత్, విశాఖపట్టణం

వాలెంటైన్స్ డే విశ్లేషణాత్మకం

ఆదివారం అనుబంధంలోని వాలెంటైన్స్ డే పుట్టుక గురించి విభిన్న కథనాలు రాశారు. అవన్నీ చదువుతుంటే చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ముఖ్యంగా వ్యాపార వర్గాలు ఈ వాలెంటైన్స్ డే ను వీక్‌గా వారంరోజుల వ్యాపారంగా మలుచుకున్నారంటే నేటి లోకంతీరు అర్థమవుతుంది. "గ్రీటింగ్స్ వీరుడు" గురించి రియల్ స్టోరీ లో రాసినది బాగా ఆకట్టుకుంది. "పిప్పరమెంటు = పడుచుపెళ్ళాం" చదవడానికే కాదు, కొంతమందికి బుద్ధి చెప్పడానికక్కూడా పనిచేస్తుంది. దంతవ్యాధుల గురించి ఎన్నో తెలియని విషయాలు తెలుసుకున్నాం. వారంవారం అనుబంధంలో చాలా విజ్ఞానదాయకం అయిన విషయాలు ప్రచురించుచున్నారు. మా బోటివారికి చాలా ఉపయోగకరంగా ఉంది.

-పి విలియంకేరి,
ఎం ఆర్ పి, పాడేరు, విశాఖజిల్లా

శశిరేఖా పరిణయం

కథ 'శశిరేఖా పరిణయం' చాలా బాగా నచ్చింది. ఎందరో దేవుళ్ళకు మొక్కి ఎన్నో వ్రతాలు చేసి, ఎంతమందో డాక్టర్ల వద్దకు వెళ్ళి శశి వరప్రసాదాన్ని కన్నది ఆ తల్లి. అందుకోసమేమో అతి గారాబంగా పెంచటమైతే పెంచింది. కొడుకు చెడిపోతున్నాడని తెలుసుకొని కొడుకును సన్మార్గంలో తేవడానికి ఎంతో శ్రమపడి ఆరోగ్యవంతుని చేద్దామని చూశారు. అతను సంఘసంస్కర్తగా ఎయిడ్స్‌తో బాధపడి చనిపోయినతని వితంతువును పెళ్ళి చేసుకోవడం శశిలోని పశ్చాత్తాపానికి నిదర్శనం. శశిలాంటి యువకులకు ఆ కథ కనువిప్పు కాగలదు. ఆ కథ రచయిత్రికి అభివాదాలు.

-బాసంగి లక్ష్మీకాంతమ్మ,
గాజువాక, విశాఖపట్టణం

జీవనశైలి వ్యాసం

ఆ శీర్షికలో రాసిన 'దయనీయ పరిస్థితి' వ్యాసం బాగుంది. అమెరికాలో ఉన్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు మురిసిపోతూ ఉంటారు. కానీ తల్లిదండ్రులు వృద్ధులై చివరి శ్వాస విడిచినప్పుడు మాత్రం కన్నబిడ్డలు అందుబాటులో ఉండరు. చివరికి ఆ తల్లిదండ్రులను చివరిసారి చూసుకోవడానికి కూడా నోచుకోకపోవడం దయనీయం. రావడానికి కుదరదని కరాఖండిగా చెప్పేయడం ఎంత శోచనీయం. పిల్లలు అమెరికాలో, తల్లిదండ్రులు ఇండియాలో ఉన్నవారి దయనీయ పరిస్థితిపై మంచి వర్ణనతో కూడిన రచన అది. మమ్మల్నెంతగానో ఆలోచింపజేసింది.

-ఎం లలిత, కంచరాం, శ్రీకాకుళం జిల్లా

భూమి... భూమి

6వ తేది ఫిబ్రవరి సంచికలో "భూమీ... భూమీ... ఎందుకిలా...?" వ్యాసం బాగుంది. భూకంపాలు గురించి చాలా చక్కగా వివరించారు. భూకంపాలు, సునామీల గురించి తెలుసుకున్నాం. ఇందులో వివరించిన కొన్ని అంశాలు సునామీ లాంటి ఉపద్రవాలకు ముందు జాగ్రత్తలు తీసుకోవటానికి ఉపయోగపడుతుంది అని చెప్పాలి.

కె. ప్రభాకర్,
చిమిర్యాల, నల్గొండ.

చల్‌మోహన రంగ...

ధరలు తగ్గించి -

అమ్ముతున్న దినుసులకు గిరాకీఎక్కువ!

అందుకే దసరా సీజన్లో తగ్గింపు ధరల తాలూకు బోర్డులు కంటికింపుగా కనిపిస్తాయి!

తలతాకట్టు పెట్టయినా 'తప్పకుండా కొంటామని ప్రతిజ్ఞలు చేస్తారు!

తగ్గింపు ధరలకు ఆ పాటి పావరుంది!

ఇంట్లో ఇల్లాలు కొత్త చీరకు ఇండెంటు పెడితే - దసరా వరకు ఓపిక పట్టమని ఇంటాయన చేతులు జోడిస్తాడు!

అల్లాంటిది -

దీపావళి, దసరాలతో ప్రమేయం లేకుండా...

సమస్తమైన వారికీ 'తగ్గింపు' ధరల్తో మందు అందుబాటులో వుంటుందని ప్రభుత్వం వారే బోర్డుకడితే మత్తు మహాజనులు తట్టుకోగలరా?

ప్రభుత్వం పచ్చగా వుండాలంటె -

ప్రజలు పాడైపోవాలని పాలకులు భావిస్తున్నారు. చవగ్గా మందిస్తామని హామీలిస్తున్నారు!

మందు పుచ్చుకుంటే పుట్టగతులుండవని మందలిస్తామంటున్నారు!

ఎగబడి తాగేందుకు వీలుగా ధరలు తగ్గిస్తామంటున్నారు.

టౌన్‌పక్కకెళ్ళేంత శ్రమలేకుండా చేస్తామంటున్నారు దయగల మహా ప్రభువులు!

ఎంచక్కా అందుబాటులో పల్లెల్లోనే బార్లు ప్రారంభిస్తామంటున్నారు.!

ఈ నేపథ్యంలో -

అమాయకులు చాలామంది పనులు పాడుచేసుకుని గుర్రాలెక్కేందుకు ముచ్చట పడుతున్నారు!

ఆడవాళ్ళు ఆందోళనపడుతున్నారు!

నేనుమాత్రం -

చెట్టెక్కి చల్‌మోహనరంగా

అని పాడుకుంటున్నాను!

✣

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతి సంగతి . . . 16
నువ్వద్ది . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 21
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

మారేకాలపు ఫలసాయం

కథ ... 8, 9

టీనేజ్ రచయిత

రియల్ స్టోరీ ... 14, 15

రమణీయ శిల్పాల రామప్పగుడి

టూరిస్ట్‌గైడ్ . . . 21

డా॥ వాసా ప్రభావతి

కళాసాహితి . . . 22, 23

"భూలోక యముండ... బీహారు పోలీసుండ"

బీహారు పోలీసులు ఏం జేసినా, సెన్సేషనే మరి! ఒకసారి చరిత్ర రికార్డుల్లోకెక్కే పనులు చేస్తారా...మరోసారి వార్తల్లో మసాలాలా నసాళానికెక్కే పనులు చేస్తారు. ఈ మధ్య వింత శిక్షాస్మృతినొక దానిని రోడ్లపై అమలు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవ్ చేశారంటూ డ్రైవర్లకు, నిబంధనలతిక్రమించారంటూ సామాన్యులకు అరకిలోమీటరు కప్పగంతుల శిక్ష వేస్తున్నారు. దానికి స్పెషల్ ఎఫెక్ట్‌గా "బెకబెక"మనకుండా ఆన్ డ్యూటీ పోలీసాయనగారి ఫేవరెట్ నాయకుడి పేరు పలకాలిట! "లల్లూ...లల్లూ" అనో, "పాశ్వాన్...పాశ్వాన్" అనో, "నితీష్...నితీష్" అనో ఆ అరకిలోమీటరూ గొంతుక్కూర్చుని, చెవులు పట్టుకుని కప్పగెంతులకు లయబద్ధంగా అనాలిట! వెరైటీగానే ఉందికదూ!

రెండు అప్పచ్చుల మధ్య అప్పడం!!



'**అ**డకత్తెర లో పోకచెక్క', 'సాండ్‌విచ్ బిట్వీన్ టూ స్లయిస్' లాంటి సామెతలాంటిదే ఇది కూడా. కాకపోతే ఇటీవల జర్మనీలో ప్రి-ఈస్టర్ పండుగ సందర్భంగా డూస్సెల్‌డార్ఫ్ అనే పట్టణంలో జరిగిన కార్నివాల్ ఉత్సవంలో జరిగిన ఈ ప్రదర్శన ఫొటో చూశాక అలా అనాలనిపిస్తుంది. ప్రతీ సంవత్సరంలాగే కిందటివారం జరిగిన ఆ సంబరాల్లో అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులకు అద్దంపట్టేలా ఉంటుందని కొందరు ఇలాంటి ప్రదర్శనొక దానిని చేశారు. రెండు బన్నుల మధ్య ఇరానీ సాంప్రదాయకత అలా తయారైందని, దానికి కారకుడు అమెరికా అధ్యక్షుడు బుష్ అని అర్థం వచ్చే ఈ ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంది. "బుష్ తయారీ ముల్లా బర్గర్, త్వరలో మార్కెట్టులోకి..." అని కూడా వ్యాఖ్యానిస్తోంది ఆ డిమాన్‌స్ట్రేషన్.

ఇదో పెళ్ళి ముచ్చట మహాప్రభో!!!

'**అం**దరిలా మంటపంలో కూర్చుని తాళి కట్టేస్తే/ కట్టించేసుకుంటే ఏముంది మజా...గాల్లో వేలాడుతూ అయితే అద్దిరిపోద్ది' అనిపించిందట వధూవరులిద్దరికీ. సుబ్బీ-సుబ్బారావ్‌ల పెళ్ళి ఎంకడి చావుకొచ్చిందన్నట్టు పురోహితుల వారు హడలి చచ్చారుష! మహారాష్ట్రమునకు చెందిన పెండ్లి కుమారుడు చి॥ ఆశిర్వాద్ అయిరే, రోడ్ ట్రాన్స్‌పోర్టు ఏజెంటునకు... అదే రాష్ట్రమునకు చెందిన పెండ్లి కుమార్తె చి॥ల॥సౌ॥ భారతీ పాటిల్, ప్రైవేట్ ఫర్మ్ ఎక్కౌంటెంటునకూ లోనావ్లా, సహ్యాద్రి వద్ద గల "ధూమకేతూ ట్రెక్కర్ క్లబ్" వారి రెండు కొండల నడుమ కట్టిన టూ-వే స్టీల్ రోప్‌లకు ఉండు క్లిఫ్‌లకు వేలాడు శుభవేళ వివాహము జరుగును. కావున తామెల్లరూ బంధుమిత్ర సపరివారముగా విచ్చేసి వధూవరులనాశీర్వదించ ప్రార్థన. ఈ లగ్గం ఎలా చేయాల్రా దేవుడా అనుకుంటున్న పురోహితులుంగార్కి కూడా వేరే క్లిఫ్ హేంగర్ వచ్చింది. పాపం పంతులు ఏం చేస్తాడు..."మ...మ...మ...మాంగల్యాం తతతతతంతునా...మమమమమజీవన హే...హే...హేయ్ అయ్యబాబోయ్...హేతునా...కకకంఠే బధ్నామీ... సుసుసుసుభగే...త్వరగా మంగళసూత్రం కట్టవయ్యా కొత్త మగడా" అనకుండా ఉంటాడా చెప్పండి!


ముందు ఇది తీసుకో...
యుపిఎ
'తెలంగాణ'కు తాయిలాలు కరీంనగర్‌కు బడ్జెట్‌లో పెద్దపీట
నారు


సమావేశాలు జరిగినంత సేపు ఆయన బొమ్మే చూపాలట అందుకే ఈ గొడవ...
ఇది ప్రభుత్వ పిరికితనం ఎమర్జెన్సీ కన్నా ఘోరం — ఎటీవీ ప్రసారాలపై బాబు
నారు

వ్యాట్
వెయిట్
చిదంబరం
వ్యాట్ అమలుకు వ్యతిరేకంగా వ్యాపార సంఘాల నిరసన

"మొఘల్-ఎ-ఆజం" సినిమా భారతీయ సినిమా చరిత్రలో ఒక మాస్టర్‌పీస్‌గా నిలిచిపోయింది. ఆ సినిమాను ఎంతోమంది ఎన్నో విధాల విశ్లేషించారు. అసాధారణ చిత్రంగా నిలిచిపోయిన మొఘల్-ఎ-ఆజం మళ్ళీ ఈ మధ్యనే మరోసారి వార్తల్లోకి వచ్చింది. దాదాపు పదికోట్ల రూపాయల ఖర్చుతో నూతన సాంకేతిక సహకారంతో ఈ నలుపు [illegible]

రంగురంగుల

చెమికల శిబి

మొఘల్-ఎ-ఆజం

కొత్త మొఘలే ఆజంలో రంగులు ఎంతో పరిపక్వత చెందిన చిత్రకారులు తమ చిత్రంకోసం ఉపయోగించే రంగుల్లా ఉన్నాయి. ఎక్కడా ఏమాత్రం తేడా లేకుండా వున్నాయి. పెద్ద పెద్ద భవనాలు, పొడవైన కారిడార్లు, దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలు, కొత్త శోభతో పరిమళించే దుస్తులు, జిగేల్‌మంటూ చక్కటి నైపుణ్యంతో మెరిసే నగలు ఇలా ప్రతి షాట్‌లో ఒక వైవిధ్యం కనిపిస్తుంది ఈ సినిమాలో. ఈ వైవిధ్యానికి ఎలాంటి భంగం కలగకుండా రంగులు వేయడమనేది సాధారణమైన విషయం కాదు.

బ్లాక్ అండ్ వైట్ సినిమాకు రంగులు వేయడమనేది సాంకేతికంగా గొప్ప విషయమే కావొచ్చు. కానీ దీనిపట్ల ప్రజలనుంచి ఇప్పటివరకు మిశ్రమ స్పందన లభించింది. అయితే రంగుల ప్రపంచానికి పూర్తిగా బానిసలైన కొత్తతరం అలనాటి క్లాసిక్ సినిమాలను చూడాలంటే ఈ రంగులేయడమనే ప్రక్రియ కొంతమేరకు సహకరించొచ్చని విమర్శకులు అంటున్నారు. ఈ రంగులేయడమనేది భవిష్యత్తులో ఎంతమేరకు సఫలమవుతుందో ఇప్పుడే చెప్పలేమని కూడా వారు చెబుతున్నారు.

చలనచిత్ర కళాసంపద-మొఘలే ఆజం

సునిశిత దర్శకత్వ నైపుణ్యంగల కరీముద్దీన్ ఆసిఫ్ దర్శకత్వంలో పృథ్వీరాజ్‌కపూర్, దిలీప్‌కుమార్, మధుబాలల అత్యద్భుత నటనతో ఒకప్పుడు సంచలనం సృష్టించిన ఈ సినిమా కల్పనా ప్రతిభకు చక్కటి నిదర్శనంగా నిలిచింది. ప్రేమ, సంఘర్షణల వాతావరణాన్ని అమోఘంగా ప్రదర్శించిన సినిమాగా సినీవిమర్శకుల ప్రశంసలు పొందింది. సలీమ్ అనార్కలీల కథ వెండితెరపై ఎన్నోసార్లు సినిమాగా రూపొందించి వుండవచ్చు. కానీ అవన్నీ మొఘల్-ఎ-ఆజం ముందు, దాని కళాత్మక వైభవం ముందు నిలువలేకపోయాయి. సినిమా మొత్తాన్ని ఒక దివ్యమైన సౌధాన్ని చూస్తున్నట్టుగా ప్రేక్షకులు చూడడం ఈ సినిమా గొప్పతనం. ఇక నౌషాద్ అందించిన సంగీత గొప్పతనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన



పనిలేదు. మొఘల్ ఏ ఆజంను చూసిన ప్రతి ప్రేక్షకుడు భావనాత్మక వీధుల్లో విహరిస్తాడనడంలో సందేహం లేదు.

సలీం-అనార్కలీ అమరప్రేమ

మొఘల్ రాజులలో గొప్ప పేరు సంపాదించుకున్న చక్రవర్తి అక్బర్. హిందూ, ముస్లిం సమైక్యతను కాపాడడానికి ప్రయత్నించిన రాజుగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. అక్బర్ చక్రవర్తి (పృథ్వీరాజ్ కపూర్) ఆయన అర్ధాంగి మహారాణి జోదా (దుర్గాఖోటే)లకు లేక లేక కలిగిన సంతానం సలీమ్ యువరాజు. యువరాజు సలీం (దిలీప్ కుమార్) యుద్ధ విద్యల్లో ఆరితేరి తల్లితండ్రుల ఆశలకు అనుగుణంగా కాబోయే మొఘల్ సామ్రాజ్య రాజుగా ఎదుగుతుంటాడు. కానీ సలీంది యుద్ధం చేసే మనసు కాదు. ఎల్లప్పుడూ ప్రేమించాలనుకునే మనసు.

రాజాస్థానంలో నృత్యం చేసే అనార్కలి అందానికి వివశుడైన యువరాజు సలీం ఆమెను ప్రేమిస్తాడు. ఇద్దరి స్థాయిల్లో తేడాను గమనించి మొదట్లో తిరస్కరించినప్పటికీ ఆ తర్వాత అనార్కలి సలీం ప్రేమకు బానిసవుతుంది. అనార్కలి ఓ సాధరణ స్త్రీ కావడంతో కయ్యానికైనా, వియ్యానికైనా సమఉజ్జీ ఉండాలనుకునే అక్బర్ మహారాజు ఈ ప్రేమను అంగీకరించకపోవడం తండ్రీ కొడుకుల మధ్యన సంఘర్షణావాతావరణం ఏర్పడటం ... ఇదీ స్థూలంగా అందరికీ తెలిసిన కథ.

"నాతోపాటు ఎంతోమంది ఇప్పటికీ ఈ సినిమాను పిచ్చిగా ఆరాధిస్తున్నారు. మొఘల్-ఎ-ఆజం వెండితెరపై ఒక అద్భుతం. దర్శకుని దార్శనికత చక్కగా సినిమా రూపంలోకి అనువాదమైంది. దర్శకుడు ఆసిఫ్ పిచ్చితనం వలననే ఈ చారిత్రాత్మక సినిమా పూర్తయింది. అతను కాకుండా ఇతరులెవరూ ఈ సినిమాను ఇంత బాగా తీసి వుండలేరని నేను ఘంటాపథంగా చెప్పగలను" అని దిలీప్‌కుమార్ తాజాగా ఈ సినిమా గురించి వ్యాఖ్యానించారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేని సినిమాను, సినిమా విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయడం తెలిసిందే. మొఘల్-ఎ-ఆజం కూడా అలా అధ్యయనానికి పనికొచ్చే సినిమాగా రూపొందింది. నాటితరం, నేటితరం అనే తేడా లేకుండా ప్రతి ప్రేక్షకునికి నచ్చేలా తయారైన ఈ సినిమా ప్రస్తుతం కలర్‌లో విడుదలై నేటి తరాన్ని కూడా క్రమక్రమంగా ఆకర్షించింది. హాలీవుడ్‌నుంచి తెప్పించిన డిజిటల్ సాంకేతిక సహాయంతో రంగుల దృశ్యకావ్యంగా మార్చి డల్బీ స్టీరియో సౌండ్‌తో రంగుల మొఘల్- ఎ-ఆజంను తయారు చేశారు.

ఈ కళాఖండం సృష్టికర్త

పది లక్షలతో ఒక సినిమాను చక్కగా తీయొచ్చనే కాలంలో ఈ సినిమా కోటిన్నరరూపాయల ఖర్చుతో తయారైంది. 1940ల చివరలో నర్గీస్, చంద్రమోహన్, సప్రూ ప్రధాన పాత్రధారులుగా మొదట ఈ సినిమా మొదలైంది. కానీ కొన్ని కారణాలవలన వీరి స్థానంలో మధుబాల, దిలీప్‌కుమార్, పృధ్వీరాజ్‌కపూర్‌లు ప్రవేశించారు. దేశదేశాల్లోకెల్లా ఫిల్మ్ ఇండస్ట్రీలో 135ఏళ్ళ అనుభవం ఉన్న "షాపూర్ పల్లాన్‌జీ అండ్ కో" ఈ చిత్ర నిర్మాణం చేపట్టింది. దాదాపు పదిహేనేళ్ళపాటు కష్టించి 1960వ సంవత్సరంలో తెరకెక్కించారు. 150 థియేటర్లలో ప్రిమియర్ షోలు ఏర్పాటయిన ప్రఖ్యాతి కూడా మొఘలే ఆజం సినిమాదే. ఆ రోజుల్లో ఆదాయవ్యయాల్లో పెద్దఎత్తున డబ్బు వినియోగించిన సినిమా ఇదే.

1951లో ఆసిఫ్ "హల్‌చల్" సినిమా అంతగా విజయం సాధించకపోయినప్పటికీ ఆర్థికంగా ఆయన పరిస్థితి ఇబ్బందికరంగా తయారయ్యింది. ఆసిఫ్ భయపడకుండా "మొఘల్-ఎ-ఆజం" తీశారు. కానీ తానొక్కడే అంత డబ్బును పెట్టుబడిగా పెట్టలేడు కాబట్టి స్టెర్లింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌తో జతకట్టాడు. 1950లో మొదలై 1960 ఆగస్టులో విడుదలయ్యేంతవరకూ ఈ సినిమా నిర్మాణం మహాయజ్ఞంలా తయారైంది. షకీల్ బదయానీ రచించిన గీతాలను ప్రముఖ సంగీత దర్శకుడు నౌషాద్ స్వరపరిచారు.

సంగీత విద్యాంసుడు ఉస్తాద్ బడే గులామ్ ఆలీ ఖాన్‌చేత ఒక పాట పాడించాలనే నిర్ణయానికి వచ్చారు ఆసిఫ్. కానీ సినిమాల్లో పాడనని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఆసిఫ్, సంగీతదర్శకుడు నౌషాద్‌లు పట్టువదలని విక్రమార్కుల్లా ఆయన చుట్టూ తిరిగారు. వీరిని వదిలించుకోవడానికి గాను ఉస్తాద్ బడే గులామ్ 'మీ సినిమాలో పాట పాడాలంటే 25వేల రూపాయలివ్వాల్సి వుంటుంద'ని వారితో చెప్పాడు. ఆ కాలంలో పేరొందిన సినిమా గాయకులు సైతం వేయినుంచి రెండువేల రూపాయలు మాత్రమే ఒక పాటకు తీసుకునేవారు. అయినప్పటికీ అంతపెద్ద మొత్తాన్ని ఇవ్వడానికి ఆసిఫ్ సంతోషంగా అంగీకరించి రెండు పాటలు ఆయనతో పాడించుకున్నాడు. ఉస్తాద్ బడే గులామ్ ఆలీఖాన్ పాడిన రెండు సినిమా పాటలు మొఘల్-ఎ-ఆజం సినిమావి మాత్రమే కావడం విశేషం. ఒక్కమాట కూడా మాట్లాడకుండా మధుబాల మొహంపై ప్రేమగా పక్షి ఈకతో దిలీప్‌కుమార్ రాస్తాడు. ఎంతో రోమాంటిసిజం కలిగిన దృశ్యంగా ఇప్పటికీ పేరుంది. హిందీ సినిమాను అధ్యయనం చేసే ప్రతి ఒకరు ఈ దృశ్యం గురించి మాట్లాడుకోకుండా ఉండలేరు. "నయాదౌర్"(1957) సినిమా విషయంలో దిలీప్‌కుమార్‌కు, మధుబాలకు మధ్యన గొడవలు రావడంతో వారిద్దరి మధ్యన మాటలు కరువయ్యాయి. మధుబాల కాంట్రాక్టును కాదనడంతో నయాదౌర్‌ను నిర్మించిన బి.ఆర్. చోప్రా ఆమెను కోర్టుకు లాగాడు. అప్పుడు మధుబాలకు వ్యతిరేకంగా దిలీప్‌కుమార్ సాక్ష్యం చెప్పడం జరిగింది. దీన్ని మనసులో పెట్టుకుని మధుబాల దిలీప్‌సాబ్‌తో మాట్లాడేది కాదు. అయినప్పటికీ వీరి మధ్యన వున్న గొడవలు నటనలో ఏమాత్రం ప్రతిఫలించలేదు. సలీమ్‌పట్ల అనార్కలీకి, అనార్కలీపట్ల సలీమ్‌కుండే గాఢమైన ప్రేమను వ్యక్తీకరించడంలో దిలీప్‌కుమార్, మధుబాలలు ఒకరితో మరొకరు పోటీపడ్డారనే చెప్పొచ్చు. ఇక మొఘల్ ఎ ఆజంలో అక్బర్‌గా నటించిన పృధీరాజ్‌కపూరయితే తాను నటిస్తున్నాననే విషయం మరిచిపోయి చక్రవర్తిలా జీవించాడు. తాను నటించబోయే ప్రతి షాట్‌కు ముందు ఆయన నిలువెత్తు అద్దంలో తనను తాను ఓసారి పరిశీలనగా చూసుకొనేవాడట. ఆయనే కాదు ఆ సినిమాలో నటించిన ప్రతి నటుడూ తాము మొఘల్ కాలానికి చెందిన వ్యక్తులమన్నట్లుగానే ప్రవర్తించారు. అందుకే ఈ సినిమా అంత గొప్పగా తయారయింది. అనార్కలి పాడిన "జబ్ ప్యార్ కియా తో దర్నా క్యా" అనే పాట ఎంతో పాపులరయిన విషయం తెలిసిందే. ఈ పాట చిత్రీకరణ జరిగిన శీష్‌మహల్ సెట్ ఒక లక్ష రూపాయల ఖర్చుతో నిర్మించారట. దీనిగురించి ఎంతో గొప్పగా నాటి సినిమాప్రియులు మాట్లాడుకునేవారు. పాకిస్థాన్ ప్రధాని జుల్ఫికర్ ఆలీ భుట్టోకూడా ఈ సెట్‌ను దర్శించి దీనిలోని కళాప్రియత్వాన్ని ఆస్వాదించారంటే ఈ సినిమా నిర్మాణం ఏ స్థాయిలో జరిగిందో ఊహించవచ్చు.

సినిమా విడుదల కాగానే ప్రారంభంలో అంత పెద్దగా ప్రేక్షకులనుంచి స్పందన రాలేదు. కారణం ఈ సినిమా నిర్మాణానికి లభించిన పబ్లిసిటీ కారణంగా మొదట్లో టికెట్లు దొరకవేమో, బ్లాక్‌లో అమ్ముతారేమో తీరిగ్గా చూడొచ్చులే అని చాలామంది ప్రేక్షకులు అనుకున్నారు. దాంతో మూడో రోజుకే థియేటర్లలో జనాలు పలుచగా కనిపించారు. ఆ తర్వాత సినిమా మెరిట్‌లు ఒకటొకటే పత్రికల ద్వారా వెలువడడం, మరోపక్క నోటిమాటగా లభించిన పబ్లిసిటీ ఈ సినిమా సూపర్‌డూపర్ హిట్టయి చాలా థియేటర్లలో గోల్డన్ జూబిలీలు చేసుకుంది. టికెట్ల అమ్మకాలు పెంచడానికి మరో రెండు పాటల్ని కలిపారు.

రంగులద్దుకున్న బ్లాక్ అండ్ వైట్

44 సంవత్సరాల తర్వాత తిరిగి ఈ బ్లాక్ అండ్ వైట్ సినిమా రంగుల సినిమాగా మారింది. డల్బీ డిజిటల్ సౌండ్‌తో మరీ సూపర్ డూపర్ హిట్ కాకపోయినప్పటికీ ఎంజాయ్ చేయొచ్చనే స్థాయిలో కొత్తతరాన్ని ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లో వందరోజులు దాటింది. ఆనాటి షాపూర్ పల్లాన్‌జీకి మూడవతరంవాడైన షాపూర్ పల్లాన్‌జీ మిస్త్రీ ఈ రంగులపనికి నడుం కట్టాడు. మనకూ తెలుగులో మాయాబజార్, గుండమ్మకథ, మల్లీశ్వరి, మిస్సమ్మ, పాతాళభైరవి... తదితర ఎన్నో కళాఖండాలనదగ్గ సినిమాలు బ్లాక్ అండ్ వైట్‌లో వున్నాయి. వీటిని నూతన సాంకేతిక సహకారంతో కలర్ చేసి తిరిగి రిలీజ్ చేస్తే ఎలాంటి స్పందన వస్తుంది? అనేది నేడు అనేకమంది సినిమా ప్రముఖులు ఆలోచిస్తున్న విషయం. అందుకు సంవత్సరాల తరబడి సమయం, కోట్లాది రూపాయలు ఖర్చు. ఇంత డబ్బు ఖర్చుపెట్టి రిస్కు తీసుకుని విడుదల చేస్తే ఫలితం (డబ్బు పరంగాగానే కాదు టెక్నికల్‌గా కూడా) ఎలా వుంటుందనే దానిపై ప్రస్తుతం చాలామంది సినిమా వ్యాపారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

ఫ్రేమ్ ఫ్రేమ్‌కీ రంగులెలా వేశారు?

ప్రతీది కంప్యూటర్ల సహకారంతో జరుగుతున్న నేటి రోజుల్లో ఇలా బటన్ నొక్కితే అలా రంగులొచ్చేస్తాయని చాలామంది అనుకుంటారు. కానీ





మాసిన తెలుపు-నలుపు సినిమాలకూ రంగులేస్తే...!

"మొఘల్-ఎ-ఆజం" మన దేశపు సినిమా కళాసంపదకే తలమానికమైంది. తెలుపు-నలుపు రంగులోనే ఆ సినిమా ఎన్నిసార్లు వచ్చినా ఇష్టంగా చూస్తారు. అంతటి అభిమాన సినిమాను రంగుల్లో చూసుకుని మరింత ఆనందించారు. శతదినోత్సవాల పర్యంతం ఆదరిస్తున్నారు. ఇదే రీతిలో మన అపురూపమైన తెలుగు సినిమాలకు కూడా రంగులేసుకుంటే ఎలా ఉంటుందని చాలామందికి అనిపించింది. కొందరైతే ఎంత ఆనందించారో... ఇంకొందరు అంతగా కూడదన్నారు. అలనాటి చిత్రరాజాలను అలా తెలుపు-నలుపుల్లో చూస్తేనే ఆనందం, అనుభూతి అంటున్నారు. ఈ విషయమై వందరోజులుగా 'మొఘల్-ఎ-ఆజం' ను ప్రదర్శిస్తున్న ప్రసాద్ ఐ మాక్స్ థియేటర్, ప్రసాద్ లాబ్స్‌కు చెందిన రాజేష్ చెప్పిన కొన్ని టెక్నికల్ అంశాలు.



మల్టీ కలర్ 'మొఘల్-ఎ-ఆజం' సినిమా పట్ల ప్రేక్షకుల స్పందన ఎలా ఉంది?

చాలా బాగుంది. వంద రోజులుగా ప్రదర్శిస్తున్నా కలెక్షన్ తగ్గలేదు. దేశవ్యాపితంగా ఇంకా ఎక్కువ రోజులు థియేటర్లలో ఆడుతూనే ఉంటుందనుకుంటున్నాం. ఆ సినిమాకు అంతటి అభిమానులున్నారు.

ఇలాంటి రంగుల ప్రయోగం మన మిస్సమ్మ, గుండమ్మకథ, దేవదాసు, పాతాళభైరవి లాంటి సినిమాలకూ చేస్తే...

మన తెలుగు చిత్రరంగానికి అది దాదాపు అసాధ్యం. ఆరేడు కోట్ల రూపాయల ఖర్చు, కంప్యూటర్లపై వందమందికి పైగా టెక్నీషియన్లతో మూడు నాలుగు సంవత్సరాల కృషి మనం చేయగలమా అనేది ఒక కోణం. మరో కోణం అంతటి మార్కెట్టు మన తెలుగు చిత్రరంగానికి లేదన్న వాస్తవం.

రంగుల 'మొఘలే ఆజం'కు వచ్చిన విజయం ఎలాంటిది?

అది ఎప్పటికీ మాస్టర్‌పీస్ అనదగ్గ కళాఖండం. తెలుపు-నలుపు లోనే దానిలోని కళాత్మకవిలువలు ఎంతో ఉన్నతమైనవి. అవి ఈ ఫిల్మ్‌ను రంగుల్లోకి మార్చడానికి ఎంతో ఉపకరించాయి. స్వతహాగానే ఈ సినిమా కళాకౌశలం బలంగా వుంది. ఇటీవలి 'షోలే' సినిమాకు సమకూర్చిన అదనపు సాంకేతిక నైపుణ్యాలేవీ దానికి అదనపు విజయాన్నేమీ సమకూర్చిపెట్టలేదన్నది గమనించాలి. – సండేడెస్క్

బ్లాక్ అండ్ వైట్ సినిమాకు అలా రంగులేయడం కుదరదు. పూర్తిగా మెషీన్లు మాత్రమే చేసే పని కాదు ఇది. వందమంది కళకారులు సంవత్సరంన్నరకు పైగా విపరీతంగా కష్టపడితేనే మొఘల్-ఎ-ఆజం కలర్ చిత్రంగా రూపొందింది. ముంబాయికి చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ యానిమేషన్ (ఐఏఏఏ) చేపట్టిన ఈ పనికి సుమారు పది కోట్లరూపాయల ఖర్చయింది. రీ రికార్డింగ్ ప్రక్రియలో నాటి సంగీత దర్శకుడు నౌషాద్ కూడా పాలుపంచుకున్నారు. "ఎఫెక్ట్ ప్లే" అనే కొత్త సాఫ్ట్‌వేర్, 24వేల రంగుల సహాయంతో ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో నిశితంగా గమనించి ప్రత్యేకంగా చేసిన పరిశోధనల ఆధారంగా ఈ సినిమాకు యానిమేషన్ నిపుణులు రంగులేశారు. ఒరిజినల్ నెగెటివ్ శిథిలమయిపోతున్న తరుణంలో దానిని ఆ దశనుంచి రక్షించారు. శబ్దం విషయంలో అమెరికా నిపుణుల సహాయంతో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తయారు చేసుకున్నారు. భారతీయులు కూడా సాంకేతికతను ఉపయోగించుకోవడంలో, అవసరాలకు అనుగుణంగా తయారు చేసుకోవడంలో ఎక్కడా వెనకబడిపోరని ఈ సినిమా నిరూపించింది. బ్లాక్ అండ్ వైట్ సినిమాలను సాంకేతిక సహాయంతో కలర్ సినిమాలుగా మార్చడమనే ప్రక్రియ అమెరికాలో విజయం సాధించలేదు. అమెరికన్లు ప్రతీది వ్యాపారాత్మకంగా చూస్తారు కాబట్టి ఆ మేరకు ఈ ప్రక్రియ అక్కడ బెడిసికొట్టింది.

సినిమా పై డాక్యుమెంటరీసినిమా

మొఘల్-ఎ-ఆజం ఎంతోమంది సినిమాప్రియులకు ప్రేరణ కలిగించింది. ఈ సినిమా సంగతులను రికార్డు చేసి, వాటిని డాక్యుమెంటరీ రూపంలో తర్వాతి తరాలకు అందించాలనే ఆలోచన ఫోటోగ్రాఫర్ జయేష్ సేథ్‌కు కలిగింది. దాంతో "ఏక్ ఐతిహాసిక్ కరిష్మా" అనే డాక్యుమెంటరీ తయారయింది. ఎన్నో సంచలనాత్మక విషయాలను కలిగిన ఈ సినిమాకు సంబంధించిన పలు విషయాలను తిరిగి పరిశోధన చేసి జయేష్ ఈ డాక్యుమెంటరీ నిర్మించారు. ఈ సినిమా ఇప్పటి తారల మీద చూపించిన ప్రభావం, అంతే కాకుండా టెక్నికల్‌గా ఎలాంటి మార్పులకు ఈ సినిమా శ్రీకారం చుట్టిందీ తెలపడం కోసం ఆయన ఈ ప్రయత్నం చేశారు.

శరత్ రచించిన "దేవదాసు" కథ వివిధ భాషల్లో సినిమాగా రూపొందింది. అయితే నలుపు తెలుపుల్లో వున్న పాత దేవదాసుకు నాటి తరం ప్రేక్షకులనుంచి దాదాపు చక్కటి స్పందన లభించింది. తెలుగు దేవదాసయితే నాగేశ్వరరావుకు ఎంతో కీర్తిని సంపాదించిపెట్టింది. నేటి తరం ప్రేక్షకులు దేవదాసు కథను తెలుసుకోవడానికి కలర్‌లో వచ్చిన (స్ట్రెయిట్ ఫిల్మ్) భన్సాలీ "దేవదాసు" చక్కగా సహకరించిందనడం అతిశయోక్తి కాదు. అయితే సలీమ్ అనార్కలీ కథను మొఘల్ ఏ ఆజం స్థాయిలో తిరిగి చిత్రీకరించడం కాని పని. కాబట్టి నేటి తరానికి ఈ క్లాసిక్ అందుబాటులోకి రావడానికి సహకరించే అంశం దానికి రంగులు వేయడమే.

తిరుగులేని రాజసంతో, గంభీరమైన నడకతో, ప్రతిధ్వనించే మాటలతో నటించిన పృధ్వీరాజ్‌కపూర్... ప్రేమ భావనకు నిలువెత్తు ప్రతిరూపంగా నిలిచిన మధుబాల, ఆమె అందానికి దాసోమన్న సలీమ్... అనార్కలీ విషయంలో వచ్చిన పొరపొచ్చాలతో తండ్రీ కొడుకులు యుద్ధానికి సిద్ధం కావడం... తదితర విషయాలు వెండితెరపై ఎంతో అట్టహాసంగా చిత్రీకరణ కావడానికి ఆ సినిమా కెమెరామెన్ మాథూర్ చేసిన కృషి అమోఘమైనది. రాజభవనాలను దేదీప్యమానంగా వుంచే వందలాది లైట్ల గ్లేర్‌ను తప్పించుకొని ఆయన కెమెరా పనిచేసిన తీరు అసామాన్యమైంది. అయితే పెద్దగా సాంకేతికత లేని సమయంలో కేవలం మేధస్సును ఆధారం చేసుకుని అద్భుతమైన కళాఖండాన్ని తయారు చేయడానికి నాటి తరం కళాకారులు కృషి చేశారు. ఆ కృషిని నేటికీ సజీవంగా ఉంచడానికి మొఘల్-ఎ-ఆజంకు రంగులు వేసి నేటి తరం కళాకారులు తమదైన ఘనతను చాటారు. ✣

మారేకాలపు ఫలసాయం

పారుపల్లి వెంకటేశ్వరరావు

జమ్మ ఆయన మేనత్తకూతురే! అయిదెకరాల మెట్టపొలం వారికుంది. కొడుకు రాకేష్ ఎం.టెక్., కూతురు రజని బి.ఎస్.సి ఫైనల్ విశాఖపట్టణంలో చదువుతున్నారు.

చదువులలో ఫస్టురాంకులు సాధిస్తున్న పిల్లల్ని, శక్తికి మించిన పనయినా అప్పులు చేస్తూ పై చదువుల్లో దించారు. ఆలుమగలు యిద్దరూ అహోరాత్రులు కష్టపడి అయిదెకరాల పొలంలోనే ఫలసాయంచేస్తూ, చేసిన అప్పుతీరుస్తూ మళ్లీ అప్పుచేస్తూ, పిల్లల్ని పట్టుదలతో చదివిస్తున్నారు.

బలరామయ్య ఉదయమే చేనికి వచ్చి పగలంతా పొలంలోనే వుంటాడు. ఉదయం పదిగంటలయ్యే సరికి రాజమ్మ భర్తకి, తనకి అన్నంతీసుకొని పొలానికి వస్తుంది. సాయంత్రందాకా ఇద్దరూ పొలంలోనే వుంటారు. కూలిమనుషుల్ని పెట్టుకోకుండా స్వంతంగా అన్ని పనులూ చేసుకునే 'శ్రమైకజీవులు' ఆ దంపతులు.

ఏడాదిగా ఆ వూరురైతుల్ని అనావృష్టి పట్టి పీడిస్తూవుంది. గత సంవత్సరమూ ఆదాయం అరకొరగానే వచ్చింది. ఆ వూరి మోతుబరి అనంతయ్య దగ్గర మళ్ళీ యాభైవేలు అప్పుతెచ్చారు. అంతకు ముందువున్న అప్పు, దానికైన చక్రవడ్డీ, అదీ ఇదీ కలిపి లక్షకు పైగానే అయ్యింది. ఎండుమొగంతో వున్న పైరు తీరుచూసి, చేనుగట్టునున్న వేపచెట్టుకింద చేరగిలబడి బలరామయ్య దిగులుతో వున్నాడు. పక్కనే రాజమ్మ బిక్కమొగంతో వుంది.

ఎన్నికలకి ముందు అధికార పార్టీ



ఎం.ఎల్.ఏ.గారు... ఈ ఊరు పక్కనే వున్న యేరుకి ఇరిగేషన్ పెట్టిస్తాం! ఈఊరు పొలాలన్నీ సస్యశ్యామలం చేస్తాం! అప్పులు తక్కువ వడ్డీకి బ్యాంకుల ద్వారా యిప్పిస్తాం! అంటూ వాగ్దానాలు గుప్పించారు. ఎన్నికలయ్యాక మళ్లీ ఈ ఊరే రాలేదు. ఆ స్కీము గురించి ఊసే లేదు.

"రాజీ! యేంజేద్దాం! అనంతయ్యనే మళ్లీ అయిదువేలన్నా అడుగుదామా?"

"ఆ ఆశగూడా లేదుబావా! కూతురు పెండ్లిజేస్తాడంట! పెద్దకట్నంతో కుదిరిందంట! పొద్దునే యింటికొచ్చాడు. మనం యివ్వాల్సిన బాకీ మొత్తంకావాలంట! మీరు ఎప్పుడడిగితే అప్పుడు అవసరాలకు అందిచ్చాను. ఇప్పుడు మీరూ అలాగే యివ్వాలన్నాడు. ఇప్పుడు మా పరిస్థితి బాగాలేదు. నీకు తెలుసుగా అంటే ఆయన గొంతుపెద్దదిజేసి, పదిమందికీ వినబడేలా అరిచాడు."

"ఇప్పుడేం జెయ్యాల రాజీ! మనం మాట పడ్డవాళ్లంగాదు. ఏదన్నా ఏసుకొని చద్దామా అంటే పిల్లల చదువులేమవుతాయోనని దిగులుగావుంది. ఇప్పుడు బతికున్నా చచ్చినోళ్లతో సమానమే! చివరికి మన బతుకులిట్లా అయ్యాయి" అని బలరామయ్య విచారంతో కన్నీరు పెట్టుకున్నారు.

చెట్టంత మనిషి కన్నీరు కారుస్తుంటే చూసి తట్టుకోలేక రాజమ్మ పక్కనే నిలిచి వెక్కివెక్కి యేడ్చింది.

ఆ సమయంలో బలరామయ్య బాల్యమిత్రుడు నిజాం ఆలీ అనుకోకుండా అక్కడికి వచ్చాడు. దుఃఖంలో వున్న దంపతులిద్దరూ ఆలీ దగ్గరకు వచ్చేదాకా గమనించలేదు.

ఆలీని చూసి కండ్లు తుడుచుకుంటున్న ఆ దంపతుల్నిచూసి, "అరే యేందిరా బలరాముడూ! యేమయిందిరా?" అని వచ్చి భుజాలు పట్టుకొని అడిగాడు.

"ఆలీ! చావటానికి కూడా వీలుకాని సమస్యల్లో చిక్కుకున్నాంరా!" అని బలరామయ్య తన కుటుంబసమస్యలన్నీ చెప్పాడు. "శక్తికిమించిన ఆశకుపోయి తప్పుచేసి యేడుస్తున్నానురా!" అన్నాడు.

"అరేభాయీ! నువ్వుచేసింది తప్పేంకాదురా! పిల్లల్ని బాగా చదివించాలనే కదా నీ ప్రయత్నం. ఒకప్పుడు మనం ఒకే స్థాయివాళ్లం! మీ నాన్నరైతు. మా నాన్నటైలరు. పదవతరగతివరకు కలిసే చదివాం. మనతో ఆర్.టి.సి. బస్సుడ్రైవరు దావీదుకొడుకు డేవిడ్ కూడా చదివాడు. మతాలు, కులాలు, వేరైనా మనం ముగ్గురం అన్నదమ్ముల్లాగా వున్నాం. పదవతరగతితో నీ చదువు ఆపి అరకపట్టి వ్యవసాయంలో దిగావు. సౌదీలో వున్న మా బాబాయి సాయంతో నేను ఎం.ఏ.చదివి, లెక్చరరునయ్యాను. అమెరికాలోవున్న అక్క, బావలసాయంతో డేవిడ్ ఇంజనీరింగు చదివి అమెరికా వెళ్లిపోయాడు. అలా ముగ్గురం మూడు దారులయ్యాం.

ఒక అధికారపక్ష ఎం.ఎల్.ఏ నాకు వామపక్షవాద ముద్రవేసి, విశాఖపట్టణం ట్రాన్స్ఫర్ చేయించాడు. విధినిర్వహణలో అంకితభావంవున్నవాళ్లు ఎక్కడికైనా వెళ్లాలి కదా! అక్కడ నాకు పరిచయమైన ఫాతిమాతో నాకు వివాహం జరగడం నీకు తెలిసిందే. ఫాతిమా ఇంగ్లీషులో, నేను తెలుగులో పి.హెచ్.డి. చేశాం. ఇద్దరం క్రమంగా యూనివర్సిటీలో ప్రొఫెసర్లం అయ్యాం! "అంతామనమంచికే" అన్నట్లు విజయవాడ నుండి

ట్రాన్స్‌ఫర్ కావటం మంచిదే అయింది. ఏకైక పుత్రుణ్ణి కనుక అమ్మ, నాన్న ఈ ఊరువదిలి నా దగ్గరికే చేరారు. ఇరవైయేండ్లుగా నేను ఈ ఊరిలో అడుగుపెట్టలేదు. ఇద్దరం ఉత్తరాలు రాసుకుంటూనే వున్నాం. నా గురించిన విషయాలన్నీ నీకు ఎప్పటికప్పుడు రాస్తూనే వున్నాను. కాని నువ్వు మాత్రం నీ కష్టాలు, నష్టాలు రాయకుండా దాచిపెట్టావు. నువ్వు రాసిన ఉత్తరాలలోని అడ్రసుల ద్వారా మీ పిల్లల్ని కలుసుకొని ఇక్కడ నీ పరిస్థితిని అర్థం చేసుకున్నాను. ఎందుకైనా మంచిదని నీకు తెలియకుండా ఈ ఊరు వచ్చాను. ఇంటికి తాళంవేసి వుంది. నీ పొలం నాకు తెలుసుగనుక యిక్కడికి వచ్చాను.

బలరాముడా! నేను ముస్లింని కాబట్టేగదరా సోదరుడిలాంటి అనుబంధం వున్న నాకు నీ కష్టాలు రాయకుండా దాచావు? అన్నాడు ఉద్వేగంతో ఆలీ.

ఆ మాటలకు బలరామయ్య నిరుత్తరుడై ఆలీ చేతులు పట్టుకొని "నిన్ను పరాయివాడిగా, ముస్లిం అన్న వివక్షతో నేనెందుకు చూస్తానురా! నా కష్టాలు నష్టాలు చెప్పి నిన్ను కలతపెట్టటం ఇష్టంలేక నీకు రాయలేదు. అందుకు నన్ను క్షమించరా!" అని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

'ఇంకా కన్నీళ్లెందుకురా! నీకు నేనున్నాను! మా ఫాతిమాకూడా మన స్నేహబంధాన్ని గుర్తించింది. మీ పిల్లలు మా పిల్లలకు పరిచయమయ్యారు. నీ కొడుకుకి నా కూతురు, నా కొడుకుకి నీకూతురు, రాఖీలు కట్టారు. ధర్మసోదరులయ్యారు. నేను ముస్లిం అయినా తెలుగుతల్లి బిడ్డడిని! భారతీయుడిని! నా మాతృభాష తెలుగు. ఉమర్ ఆలీషా ముస్లిం కుటుంబంలో పుట్టినా ప్రఖ్యాత తెలుగుకవి అయ్యాడు. జాషువా క్రైస్తవ మతకుటుంబంలో పుట్టినా తెలుగు కవికోకిల అయ్యాడు. నేనువారి అభిమానిని... ఇంతకీ బలరాముడా! మీరు అన్నం తిన్నారా? అని రాజమ్మను అడిగాడు.

"ఇంకా తినలేదు బావగారూ! అన్నం తెచ్చాను. రోజూ అన్నం పొలానికే తెచ్చుకొని ఇద్దరం యిక్కడే తింటాం! ఈ రోజు దిగులుతో తినలేదు."

''అయితే ముగ్గురం యిక్కడే అన్నం పంచుకుతిందాం. నాకు ఆకలిగా వుంది. ఈ రోజు మీ దంపతులతో కలిసి పొలంలో అన్నంతినే అదృష్టం కలిగింది."

* * *

ఆలీ వట్టి చేతులతో రాలేదు. స్నేహితుణ్ణి ఆదుకోవటానికి డబ్బుతోనే వచ్చాడు. ఆయిల్‌యింజను అద్దెకు తీసుకొని, అరకిలోమీటరు దూరంలో వున్న యేటికి ఇంజనుపెట్టి పొలందాకా పైపులు బిగించి బలరామయ్య వేరుశనగపైరుకి నీరుపెట్టించాడు. పైరుకు జీవకళ వచ్చింది. రెండు మూడు రోజులకే పంటచేను పచ్చగా నవ్వింది.

"ఆలీ! పైరుకూ, నాకూ ప్రాణంపోశావురా! నీ ఋణం ఎలా తీరుతుందో."

"నోరుముయ్యరా బేవఖూఫ్! నీకూ నాకూ మధ్య ఋణాలా? ఈ పనిచేసి నిన్ను ఆదుకున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది. సృష్టిలో తీయనిది స్నేహమే! అన్నారు. అందులో బాల్యస్నేహం మరింత తీయనిది, విలువైనది. మన బాల్యమిత్రుడు డేవిడ్‌గాడు మనల్ని మర్చిపోయాడనుకున్నాను. ఈ మధ్య నాకు అమెరికానుండి తెలుగులో ఉత్తరం రాశాడు. ఇండియా వస్తాడట! ఈ ఊరికి యేదో ఉపకారం చేస్తాడట"

* * *

మిత్రులిద్దరూ అనంతరామయ్య ఇంటికి బయలుదేరారు. ఎనభై ఎకరాలపొలం, ఎడ్లు, బండ్లు, వ్యవసాయం, వడ్డీవ్యాపారం హంగామా వున్న మోతుబరిరైతు అనంతయ్యకి ఒక కొడుకు, కూతురువున్నారు. కొడుకు శ్రీకాంత్ ఎం.బి.ఏ., కూతురు శ్రీలత బి.టెక్ చదువుతున్నారు. ఆ ఇద్దరు కూడా చదివేది విశాఖపట్టణంలోనే.

అనంతయ్య తన ఇంటిముందు ఆవరణలో నిలబడివున్నాడు. ఆలీ, బలరామయ్య కలిసిరావటం చూసి, రావయ్యా ఆలీ! పాతమిత్రుడితో కలిసి బహుకాలానికి కనపడ్డావు! ఊరక రారుగదా! పనేమిటో చెప్పండి! అన్నాడు.

ఆలీని పలకరించటంలో అనంతయ్య అహంకారం తొణికిసలాడుతూవుంది. లోపలికి ఆహ్వానించకుండా ఆవరణలో నిలబట్టే మాట్లాడుతున్నాడు. ఆలీ ఆ ఊరు నుండి వెళ్లిపోయాక మళ్లీ రావటం అదే ప్రథమం! అతని ఉద్యోగం, స్థితిగతులు, అనంతయ్యకి తెలియవు. తనని అప్పు అడగటానికి వచ్చాడని భావించాడు.

"అనంతయ్యగారూ! మాబోటి చిన్నవాళ్లకు వేరే పనులేమి వుంటాయిలెండి! అప్పులు చెయ్యటం, అవి చక్రవడ్డీతో తడిసి మోపెడయ్యాక చెల్లించటం! అదేగా మాబోటివాళ్ల పని? బలరామయ్య బాకీ లెక్కచూడండి! యిస్తాం!"

అంత తొందరగా బలరామయ్య బాకీ వసూలు అవుతుందని ఊహించని అనంతయ్య ఒకింత ఆశ్చర్యంతో ఇంట్లోకి వెళ్లి నోటు తెచ్చాడు. వడ్డీతోసహా లక్షా అయిదువేలు ఆలీ యిచ్చాడు.

తిరిగెళ్తున్న బలరామయ్య, ఆలీలకు అప్పుడే విశాఖపట్టణం నుండి వస్తున్న అనంతయ్య కొడుకు శ్రీకాంత్, కూతురు శ్రీలత ఆవరణలో ఎదురయ్యారు. అ ఇద్దరికి నమస్కారాలు చేశారు.

వారికి తాను తెలుసునన్న విషయం, తన ఉద్యోగవిషయం, తండ్రి అనంతయ్యకు చెప్పవద్దని ఆలీ ఆ ఇద్దరికీ సంజ్ఞచేసి మెల్లగా చెప్పి, బలరామయ్యతో కలిసి వెళ్లిపోయాడు.

ఆ ఇద్దరూ వెళ్లిపోగానే అనంతయ్య కొడుకు, కూతురువైపు కోపంగా చూసి, "ఆలీ ఈ ఊళ్ళో ఒక టైలరు కొడుకు. ఆ బలరామయ్య ఒక ఆఫీసరూకాదు, నాయకుడూకాదు. ఆ స్థాయి మనుషులకు మీరు అంతగా చేతులు జోడించి వందనాలుచేయాలా? నాకు చిన్నతనంగా వుంది" అన్నాడు అసహనంగా.

"నాన్నా! ఆ యిద్దరూ మా కంటె పెద్దవారు. మీ వయసువారు. మన యింటికి వచ్చినవారు! అలాంటి పెద్దవారికి నమస్కరించటం మా బోటి చిన్నవాళ్లకు మర్యాద, సంస్కారం!"

"తాతలనాటి ఆస్తిగా నీకు సంక్రమించిన పొలంలో వచ్చిన ఆదాయంతో నువ్వు మమ్మల్ని యే చదువులు చదివిస్తున్నావో అవే చదువులు బలరామయ్య మామయ్య అయిదు ఎకరాల పొలాన్ని అహర్నిశలు శ్రమపడి పండించి, ఆ ఆదాయంతో చదివించాడు. పిల్లల్ని మాతో సమానస్థాయికి తెచ్చాడు. ఆ దంపతులిద్దరూ శ్రమైకజీవులు!"

''శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదు" అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అటువంటి శ్రమజీవి బలరామయ్య మామయ్య కంటె నమస్కారానికి అర్హులెవరు? ఆయనది శ్రమైక జీవనం, నీది పరభాగ్యోపజీవనం! అన్నాడు శ్రీకాంత్.

కాలేజీలో మీరు నేర్చుకుంది ఈ సుద్దులేనా? నాకే నీతులు చెప్పే పెద్దవాళ్లు అయ్యారా?" అన్నాడు వెటకారంతో కూడిన కోపంతో అనంతయ్య.

* * *

''యేందయ్యో! అనంతయ్యా! బలరామయ్య నీకు రావాల్సిన బాకీ మొత్తం. మహమ్మదాలీ కొడుకు నిజామాలీ తీర్చేశాడంటగా?"

ఊరి రచ్చబండ దగ్గర అనంతయ్యని ఒక రైతు అదొకవింతవార్తగా అడిగాడు.

"అంతేనా! ఏటికి యింజను పెట్టించి, అయిదెకరాల వేరుశనగ పైరుకి నీరు ఆలీయే పెట్టించాడు" అన్నాడు మరొక రైతు.

"ఆ ఇద్దరి మైత్రీబంధం అలాంటిదండీ పరమమిత్రుడు గల్గ బంధువర్గంబేల? అని శతకనీతి చెబుతుంది" అన్నాడు రిటైరైన తెలుగు మాష్టరు రమణమూర్తి.

" ఆపవయ్యా పంతులూ నీసుద్దులు! ఆలీ కుటుంబం గురించి మా పిల్లలు చెప్పారులే. మా పిల్లలు చదివేది విశాఖపట్నంలోనే! ఆలీకి ఒక కొడుకు, కూతురు వున్నారంట? బలరామయ కూతురు, కొడుకు చదివేది కూడా విశాఖపట్నంలోనే. ఆలీకొడుక్కి బలరామయ్య కూతురుకి అనుబంధం ఏర్పడివుంటుంది. ఆలీ కూతురుని కూడా బలరామయ్య కొడుక్కి చేసుకునే ఆలోచన వుందేమో! ఆ ఆలోచనే లేకపోతే అంత బాకీ తీర్చటం, సొంతపొలంలాగా పొలానికి నీరు పెట్టించటం, అది మైత్రీ బంధమేనంటే బుద్ధి వున్న వాడెవడూ నమ్మడు" అన్నాడు అనంతయ్య.

"అవ్వ! కూతురుని ఒక తురక కుటుంబంలోకి కోడలుగా పంపటం, కోడలుగా ఒక తురక కుటుంబపు అమ్మాయిని తెచ్చుకోవటం సిగ్గుచేటు! డబ్బుకోసం బలరామయ్య ఎంత దిగజారాడు! డబ్బుకు లోకం దాసోహం అంటే యిదే!" అన్నాడొక పెద్దమనిషి.

"అసలు విషయం తెలియకుండా అంతా జరిగిపోయినట్లే అల్లుకుపోతున్నారు! ఆపైన సిగ్గుపడాల్సివస్తుంది. నోరుజారకండి!" అన్నాడు రమణమూర్తి అసహనంగా.

''ఆలీ తెలుగు ప్రొఫెసరంట. మన రమణమూర్తిగారు తెలుగు మాష్టరు. అందుకే ఈయనకి అభిమానం! ఆలీ, బలరామయ్య వియ్యమందుకోవటం తప్పుకుండా జరుగుతుంది" అన్నాడు అనంతయ్య.

అలా చర్చ జరుగుతూ వుండగానే మూడు అంబాసిడర్‌కార్లు ఆ సెంటరుకు వచ్చి ఆగాయి. ఒక కారులో అనంతయ్యకొడుకు శ్రీకాంత్, బలరామయ్య కూతురు రజని మెడలో దండలతో వధూవరులుగా పక్క పక్కనే కూర్చొని వున్నాడు. మరొక కారులో బలరామయ్య కొడుకు రాకేష్, అనంతయ్యకూతురు శ్రీలత పెండ్లి దండలతో వధూవరులుగా పక్క పక్కనే కూర్చొనివున్నారు.

ఆలీ, ఆయన భార్య ఫాతిమా, బలరామయ్య, రాజమ్మ మూడోకారులో వున్నారు. అంతకుముందు అవాకులు చవాకులు పేలిన పలుకాకులు తలలు దించుకున్నారు.

"ఆ వివాహాలకు వేదిక విజయవాడ రిజిష్టరు ఆఫీసు. అవి స్వయంవరంగా ఆ యువతీ యువకులు నిర్ణయించుకున్న వివాహాలు, ఆదర్శ వివాహాలు!

"అనంతయ్యగారూ! ఇంటికి వెళ్తాం రండి! కొడుకుని, కోడల్నీ, కూతుర్ని, అల్లుణ్ణి మీ దంపతులు ఆశీర్వదించాలి" అని పిలిచాడు ఆలీ.

అనంతయ్య కిక్కురుమనకుండా కొడుకు వున్నకారులో కూర్చున్నాడు. ✤

ఫంక్షన్ ...ఫంక్షన్

అంపశయ్య నవీన్

“ఎక్కడికో వెళ్తొస్తున్నట్టున్నారు?”

“ఓ పెద్ద ఫంక్షన్‌కెళ్ళొస్తున్నా’

“యేం ఫంక్షనో? యేదన్నా సాహితీగోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాలుండే ఫంక్షనా?”

“అలాంటి ఫంక్షన్స్‌కు నేనెక్కడెళ్తాలెండి?”

“యేం? ఎందుకు వెళ్ళరు... మీకు సంగీతమన్నా, సాహిత్యమన్నా చాలా ఇష్టమేగదా”

“అది ఒక్కప్పటిమాట... అంత తీరికా, ఓపికా, మనస్థిమితం ఇప్పుడెక్కడున్నాయి?!

“ఇంతకూ మీరు వెళ్ళింది యే ఫంక్షన్‌కు?”

“మా శ్రీమతి వాళ్ళ అన్నయ్యా మనవడి బర్త్‌డే ఫంక్షన్‌కు”

“మీ బావమరిది మనవడి బర్త్‌డే ఫంక్షన్‌కు అంటే కొంచెం సులభంగా అర్థమవుతుందికదా”

‘‘అర్థమవుతుందా? అర్థంకాదా అని నేనాలోచించలేదులెండి. నాకు తోచినట్టు చెప్పాను.”

“ఫంక్షన్ ఎలా జరిగింది?”

“అబ్బో! అది ఫంక్షనా? అవి వంటలా? అవి అరేంజిమెంట్సా? యేం చెప్పమంటారు. చెప్పడానికి నా దగ్గర మాటల్లేవు. నాకు తోచినట్టు చెప్పాననుకోండి మీరు అర్థంకాలేదంటారు...”

“తెలుగులోనే చెబుతున్నారుగదా... అర్థమవుతుందిలెండి... బర్త్‌డే ఫంక్షన్ కూడా అంత గ్రాండ్‌గా జరిగిందా?”

‘‘రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టు డబ్బున్నవాడు తల్చుకుంటే అరేంజిమెంట్లకు కొదువా? ఎంత గ్రాండ్‌గా చేశారనుకున్నారు... ఈ బర్త్‌డే జరుపుకోవడానికి చేసిన ఖర్చుతో మూడునాలుగు పెళ్ళిళ్ళు చెయ్యొచ్చు... ఓ రెండుమూడు వేలమంది అతిథులొచ్చారు. మావాడు అంటే మా బావమరిది కొడుక్కు ఈ ఊళ్ళో ఐదారు కాలేజీలున్నాయి. ఇప్పుడన్నీ ప్రైవేట్ కాలేజీలే కదా. ఓ ఇంజనీరింగ్ కాలేజి, ఓ మెడికల్ కాలేజి, ఓ బి.ఇడి. కాలేజి, ఓ డిగ్రీ కాలేజి, ఓ పీ.జీ కాలేజి... వాడిచేతిలో ఇన్ని కాలేజీలున్నాయి. చాలాకాలం దాకా పిల్లలు పుట్టలేదు. పెళ్ళైన పదేళ్ళ తర్వాత, సంతానసాఫల్యకేంద్రాల చుట్టూ తిరిగి ఎన్నో లక్షలు ఖర్చుపెట్టాక, ఎట్‌లాస్ట్ వాడికో కొడుకుపుట్టాడు. దాంతో వాళ్ళెంత సంతోషించి ఉంటారో మీరూహించుకోవచ్చు. ప్రతి సంవత్సరం వాడి బర్త్‌డేకు ఎన్ని లక్షలు ఖర్చుచేస్తున్నారో లెక్కలేదు. ఈ రోజు జరిగింది వాడి ఐదో బర్త్‌డే... చాలా నష్టాలన్నీ తొలిగిపోయాయని వాళ్ళే ఈసారి ఇంకా విజృంభించి వాడి బర్త్‌డే జరిపారు. ఈ ఫంక్షన్‌కొచ్చిన జనాన్ని చూస్తే నాకు మతి పోయిందనుకోండి?”

“మీ మతెందుకు పోవాలి?”

“ఓ బర్త్‌డే ఫంక్షన్‌కి ఈ ఊర్లో ఉన్న గొప్ప గొప్ప వాళ్ళందరూ రావడమేమిటనిపించింది.”

‘ఎవరెవరొచ్చారేమిటి?”

“మన జిల్లా ఎం.ఎల్.ఏలందరూ - పార్టీలతో నిమిత్తం లేకుండా వచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్.పీ లాంటి ప్రభుత్వాధికారులందరూ వచ్చారు. మనూర్లో ఉన్న పెద్దపెద్ద వ్యాపారస్తులందరూ అక్కడే ఉన్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, యూనివర్శిటీ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, కాంట్రాక్టర్లు, వకీళ్ళు, క్రీమ్ ఆఫ్‌ది సొసైటీ అంటారే - వాళ్ళంతా వచ్చారు...”

“మై గాడ్! బర్త్‌డేకి ఇంత హంగామా చెయ్యడమా?”

“ఇంకా చెబుతా వినండి. పెద్ద ఫంక్షన్ హాల్. ఫంక్షన్ హాలంటే అల్లాటప్పా హాలనుకుంటున్నారా? ఫుల్లీ ఎయిర్‌కండిషన్డ్ హాల్. వెయ్యిమంది కూర్చోవచ్చు. అవసరమయితే ఇంకో రెండుమూడు వందలమందికి కూడా అదనంగా కుర్చీలు వెయ్యొచ్చు. ఇక ఆ ఫంక్షన్ హాల్‌కు చేసిన డెకొరేషన్ ఎంత గ్రాండ్‌గా ఉందనుకున్నారు. కళ్ళు మిరుమిట్లు గొల్పాయంటే నమ్మండి. ఈ డెకొరేషన్‌కే ఓ లక్షరూపాయలు ఖర్చయిందేమోనని నాకనిపించింది. ఇక వంటలు చూడండి. ఓ పాతిక రకాల వంటలు. చికెన్, మటన్, ఫిష్, ఎగ్స్. ఒక్కొక్క దాంట్లో మళ్ళీ ఐదారు రకాలు. తినడానికొచ్చిన జనం దేన్ని తినాలో, దేన్ని వదిలెయ్యాలో తేల్చుకోలేకపోయారంటే నమ్మండి. అందరూ అన్నీ తినడానికి ప్రయత్నించారు. ఓ పెద్దస్టార్ హోటల్ వాళ్ళకి కేటరింగ్ అప్పజెప్పారట. ఒక్కో ప్లేటుకి ఐదువందలు రేటట. అందరూ భోజనాలు చేశాక ప్లేట్లు లెక్కపెడ్తే రెండువేలని తేలిందట.”

“అంటే భోజనాల ఖర్చే పది లక్షలన్నమాట”!

“యేమనుకున్నారు మరి? ఐదు కార్పొరేట్ కాలేజీల యజమానంటే?! అయితే ఇంత ఖర్చు చేసినా దీంట్లో కొంత రాబడి కూడా ఉందండోయ్!”

“అదెలా?”

“ఈ ఫంక్షన్‌కొచ్చిన వాళ్ళంతా పిల్లవాడికి అక్షింతలెయ్యడానికొచ్చినప్పుడు పిల్లవాడి చేతిలో కవర్లు పెట్టి వెళ్ళారు. ఆ కవర్లలో కరెన్సీ నోట్లుంటాయని మీరూహించే వుంటారు.”

“అవును... ఉహించాను”

“అందరూ వెళ్ళిపోయాక మావాళ్ళు కవర్లు విప్పి చూశారు. యే కవరు విప్పినా ఐదువందలనోట్లే! తక్కువలో తక్కువ ఐదువందలు... ఎక్కువలో ఎక్కువ ఐదువేలు. కవర్లన్నీ విప్పి వాటిల్లో ఉన్న కరెన్సీనోట్లు లెక్కపెట్టడానికి ఓ రోజంతా పట్టిందనుకోండి.

“మొత్తం ఎంతుందేమిటి”

“నాకు కరెక్ట్‌గా వాళ్ళు చెప్పలేదుగానీ... ఖర్చుకూ రాబడికీ సరిపోయిందని నాకర్థమయింది”

“ఇలాంటి ఫంక్షన్స్‌ని మన ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు గమనించాలండి. ఎంత టాక్స్ ఎగవేయకపోతే ఇలాంటి లావిష్ ఫంక్షన్స్ జరుపగల్గుతారో మనం అంచనా వెయ్యలేం. ఈ ఫంక్షన్స్ మీద కూడా నిఘా ఉండాలండీ” “ఏం నిఘా ఉంటుందండీ? ఇక్కడ డబ్బున్న వాడిదే రాజ్యం, వాడు ఎంత ఖర్చుపెడ్తాడో... అంతకంటే ఎక్కువ రాబట్టుకుంటాడు. ఇలాంటి ఫంక్షన్స్ కూడా ఒక వ్యాపారమే!” ✣

పి.ఎం.సుందరరావు

తల్లి చేసిన తప్పు

గంగవరం ఓ చిన్న గ్రామం. అక్కడ సూరమ్మ, కాంతయ్య దంపతులు నివసించేవారు. వారికి కోటేశు ఒక్కడే కుమారుడు. ఇతను పసివాడుగా వున్నప్పుడే తండ్రి కాంతయ్య జబ్బు చేసి చనిపోయాడు. అప్పుడు కూడా సూరమ్మకు బంధువుల నుండి ఎలాంటి సహాయం లభించలేదు. దీంతో కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించసాగింది సూరమ్మ. వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే కొడుకును మాత్రం చదివించేది.

కోటేశుకు ఆశ ఎక్కువ. ఎవరైనా ఏదైనా కొత్త వస్తువు కొనుక్కుంటే అలాంటిది తనకు కూడా కావాలనుకుంటాడు. అతను అడిగినవన్నీ కొనిపెట్టే ఆర్థిక స్తోమత సూరమ్మకు లేదు.

ఒకసారి తోటి విద్యార్థి చేతిలో కొత్త పెన్ను చూశాడు కోటేశు. దానిని ఎలాగైనా కాజేయాలనుకున్నాడు. అందరూ ఆటస్థలంలో వున్నప్పుడు పుస్తకాల సంచిలోనుండి మెల్లగా ఆ పెన్నును తీసి జేబులో పెట్టుకున్నాడు. కాసేపయ్యాక ఆ విద్యార్థి తన పెన్ను పోయిన విషయాన్ని గమనించాడు. 'ఊ_ఊ_ నా పెన్ను పోయిందీ. ఎవరో కాజేశారూ_' అని ఏడుస్తున్నా ఏమీ ఎరగనట్టు వుండిపోయాడు కోటేశు.

స్కూలు అయిన తర్వాత సాయంత్రం ఇంటికి వచ్చి, తాను కాజేసిన పెన్నును తల్లికి చూపించాడు కోటేశు. కొడుకు చేసిన పనికి దండించకుండా, "ఇలాంటి పనులు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా చేయాలి. పెన్ను దాచుకో బాగుంది" అని మెచ్చుకుంది సూరమ్మ.

దాంతో దొంగతనాలు చేయడం తప్పుకాదని భావించాడు కోటేశు. అప్పటి నుండి వీలు దొరికినప్పుడల్లా క్లాసులో పుస్తకాలు, స్నేహితుల దగ్గర డబ్బులు కాజేయసాగాడు. తల్లి సూరమ్మకు ఇది తెలిసి కూడా కొడుకును మందలించేదికాదు.

కొన్నాళ్ల తర్వాత ఓ రోజు సాయంత్రం... సూరమ్మ కూలి పనికి వెళ్లి అప్పడే ఇంటికి వచ్చింది. పక్కింటివాళ్లు వచ్చి, "మీ అబ్బాయి కోటేశును పోలీస్‌స్టేషన్‌లో వుంచారట. త్వరగా వెళ్లు" అని చెప్పారు. సూరమ్మ లబోదిబోమంటూ ఆ గ్రామ సర్పంచ్ రాఘవయ్యను తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

రాఘవయ్య విషయమేమిటని పోలీసుల్ని అడిగాడు. "ఈ అబ్బాయి వాళ్ల స్కూలు ఆఫీసులో వున్న రెండు వేల రూపాయలు కాజేశాడు. హెడ్మాస్టారు ఇచ్చిన రిపోర్టు ప్రకారం తీసుకొచ్చాం" అని చెప్పారు పోలీసులు.

అంతా విని సూరమ్మ పశ్చాత్తాపంతో, "నా కొడుకు కోటేశు ఇలా దొంగగా మారడానికి కారణం నేనే. మొదట్లో పెన్ను దొంగిలించిన రోజునే దండించి వుంటే, ఇలా తయారయ్యేవాడు కాదు. నా మీద దయవుంచి నా బిడ్డను క్షమించండి" అని పోలీసుల్ని, సర్పంచ్ రాఘవయ్యను ప్రాధేయపడింది. సర్పంచ్ రాఘవయ్య ఎలాగోలా హెడ్మాస్టారును ఒప్పించి కోటేశును విడిపించాడు. సూరమ్మ అవమానంతో తలదించుకుంది. అప్పటి నుండి కోటేశు దొంగబుద్ధిని మార్చుకొని మంచి విద్యార్థిగా మెలగసాగాడు. తల్లికూడా మరెప్పడూ దొంగతనాలను ప్రోత్సహించలేదు. పైగా అది తప్పని సందర్భం వచ్చినప్పడల్లా చెప్పేది. దాంతో కోటేశు పూర్తిగా మారిపోయాడు.



వి'చిత్రం'



చిన్నారి పొన్నారి నేస్తాలూ...! మనం వారం వారం ఓ వి'చిత్రం' చూస్తున్నాం కదా. ఎలా వుంటున్నాయి. మీ అందరికీ నచ్చుతున్నాయా? సరేగాని.... ఈ వారం మీ ముందుకు వచ్చిన చిత్రం చూశారుగా. మీకు అందులో ఏం కనిపిస్తోంది? బాగా పరిశీలనగా చూసి మరీ చెప్పండి. అబ్బో... అందరూ బాగా చూసి తీవ్రంగా ఆలోచిస్తున్నారే. చూస్తుంటే మీరు ఈ వారం సరైన సమాధానం చెప్పేసేటట్టున్నారు. ఏది చెప్పండి చూద్దాం. ఏంటీ... బొమ్మలో వానొచ్చేట్టుగా మబ్బులు పట్టివున్నాయా? ఓ అబ్బాయి బూర లాంటిది ఊదుతున్నాడా? ఇంకా అక్కడ బోలెడన్ని రాళ్లు వున్నాయా! ఇంత వరకు ఒకే గానీ... మరి అతను బూర ఎందుకు ఊదుతున్నాడో చెప్పగలరా? లేదా! అయితే జవాబు చూడండే.

జవాబు

చిన్నారులూ... జవాబు చెప్పేస్తున్నాం. వాతావరణం చూస్తేనేమో వానొచ్చేట్టుంది. ఓ పిల్లవాడు బూరలాంటిది ఊదుతున్నాడన్నారే. అతనేమో అక్కడ గేదెలను మేపుతున్నాడు. మబ్బులు పట్టేసరికి తన గేదెలను పిలుస్తూ బూర ఊదసాగాడు. కానీ... నేస్తాలూ! అతను వెతుకుతున్న గేదెలు అక్కడే వున్నాయర్రా! మీకేవైనా కనిపించాయా. రాళ్లలాగా వున్నాయే. అవేనర్రా! గేదెలు. కావాలంటే చూడండి నీళ్లల్లో వాటి ప్రతిబింబం కూడా కనిపిస్తోంది. అవునా! వచ్చేవారం మరో వి'చిత్రం'తో మీ ముందుంటామే. అందాకా సెలవామరి.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?



నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు వచ్చిన విప్లవకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఎవరో గుర్తు వట్టారా? మరి వెంటనే కార్డుమీద రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు:
సానియా మీర్జా

సరైన సమాధానాలు రాసినవారు

(బ్రాకెట్‌లో వున్న అంకె వారు చదువుతున్న తరగతి)

ఎ.అనిల్ (6), సోంపేట. పి.అనుదీప్ (8), పాడేరు. ఎం.డి.సలీం (6), రామన్నపేట. బి.కాంచన, ఎస్‌కె అష్రఫ్ అలీ (8), ఎస్‌కె నుస్రత్ పర్వీన్ (6), బి.కళ్యాణ్ సాయి రాజు (4), ఎస్‌కె అజ్మత్ అలీ (10), టేకులపల్లి. బి.విఘ్నేష్ (7), మాటూరు. కె.మంజుల(10), కోడుమూరు. కె.శ్రీఅనూష్య (6), గుంటూరు. పి.కార్తికేయ, 6వతరగతి, బద్దిపడగ. వై.ప్రసాద్, వి.అమ్మతల్లినాయుడు(9), ఉత్తరావల్లి. కె.నాగరాజు, ఎస్.నాగరాజు(9), గంగుబూడి. వి.ప్రవీణ్‌కుమార్, లక్సెట్టిపేట. బి.అనురాగ్ శ్రీ. హైదరాబాద్. పి.నిధి (ఎల్‌కెజి), శంకర్ విద్యాలయ హైస్కూల్, మల్కాజీ, హైదరాబాదు. బి.శ్రవణ్‌కుమార్ (6), నల్గొండ. జి.సాయిభరత్‌రెడ్డి (6), మోదుకూరు. వి.సౌమ్య (5), వి.రాజావంశీధర్ (7), ఈమని. శివ, చిరంజీవి, మణి, ఎ.కనకదుర్గాప్రసాద్ (7), చీరాల. బి.విఘ్నేష్ (7), మాటూరు. డి.అనిల్‌కుమార్ (6), ఆదోని. పి.అమర్‌జయసింహ, అనకాపల్లి. ఆర్.కిష్టయ్య (10), ఆర్.ఆంజనేయులు (8), మహబూబ్‌నగర్. ఎం.అవినాష్ (7), ఎం.అభిషేక్ (3), కంచరాం. యు.పవన్‌కుమార్, యు.నాగరాజు, అలోఫ్ (5), కల్లుకుంట. సిహెచ్ చిత్రాంజని (5), వి.సతీష్ (6), కాకినాడ. కె.శ్రీఅనూష్య (6), గుంటూరు. ఎన్.వస్తాద్‌నాయక్, ఎం.వెన్నెల (8), ఎన్.శంకర్‌నాయక్ (7), బాలు, శ్రీను, కుమారి, దేవి, నీల, పద్మ (6), సోనా, సింగ్మా (5), పణవత్తు తండా, నేరుడుగుమ్మ. జి.సంధ్యారాణి (10), అద్దూరు. ఎం.డి.యాసిన్ ఫాతిమా, నరసరావుపేట. డి.అనుదీప్ (8), పాడేరు. ఎల్.రామలక్ష్మి, బి.రమాదేవి, (8), భీమిలి. పి.జయశ్రీ (7), చిలకలూరిపేట. షాజియా ఖతీబ్ (3), షహజాద్ ఖతీబ్ (4), గడి. ఎల్.సుబ్రమణ్యం, డి.సుబ్రమణ్యం, ఆర్.అశోక్‌కుమార్ (9), చిన్నగొట్టిగుల్ల. ఎం.సంతోష్‌కుమార్ (8), తిరుమలగిరి. ఎస్.నాగేంద్రబాబు (9), దర్శి. బి. సృజన (7), గీతాంజలి హైస్కూల్, చిక్కడపల్లి, హైదరాబాదు. కె.చరిత (5), సెయింట్ పాయిస్ గరల్స్ టెన్త్ హైస్కూల్, రామ్‌నగర్, హైదరాబాదు.

*

పూలమొక్కను చేరేదెలా?



ఆ పాప పేరు మందారం. పేరుకు తగ్గట్టుగానే ఆమెకు మందార పూలంటే మహా ఇష్టం. కావాలంటే చూడండి తల నిండా ఎన్ని పూలు పెట్టుకుందో. ఇంకా మందార పూలు సంపాదించాలనుకుంది. పార్కుకు అవతల మందార చెట్టుందని ఎవరో చెప్పారు. దాం వెతుక్కుంటూ బయలుదేరింది. కానీ... దారి మాత్రం గజిబిజిగా వుంది. పాపం చిన్నపిల్ల. మీరై సాయం చేయొచ్చుకదా.

ఆ ఫొటో ఎవరిదబ్బా!

హాయ్! ఏం చేస్తున్నారు. మీరు అది. ఇది. అని ఓ పెద్దమనిషి దగ్గర రెచ్చిపోయి కోతలు కోసేశాం. ఆయన మిమ్మల్ని ఓ తమాషా ప్రశ్న అడుగుతారట. దానికి సరైన సమాధానం చెప్పి మీ మీద మాకున్న నమ్మకాన్ని మరింత పెంచాలి. ఓకేనా! మరైతే ఆ పెద్దాయన వచ్చేస్తున్నారు. వచ్చేశారు.

పిల్లలూ! మీరు చాలా తెలివైన వాళ్లని, ఎంతటి కష్టమైన ప్రశ్న అడిగినా ఇట్టే చెప్పేస్తారని మీ వాళ్లు చెప్పారు. అది నిజమో కాదో ఇప్పడే తేల్చేద్దామనుకుంటున్నా. మరి ప్రశ్న అడగనా! **నేను ఓ ఫొటోని చూస్తున్నాను. అది ఎవరిదై వుంటుంది? నాకు తమ్ముళ్లు లేరు. చెల్లెళ్లు అంతకన్నా లేరు. నా భార్య సంగతంటారా! ఆమె ఇటీవలే కాలం చేసింది. మరి నేను చూసే ఫొటో ఎవరిదబ్బా!** ఏంటి అలా తెల్లమొహాలు వేసుకుని చూస్తున్నారు. పోనీ ఒక ఆధారం చెప్పమంటారా. ఫొటోలో వున్న అతని తండ్రి మా నాన్నకు కొడుకు. మరి ఇప్పడు చెప్పండి. ఆ ఫొటో ఎవరిది?

(సమాధానం పైవారం)

ముగ్గురి వయస్సు ఎంత?

జవాబు

జాన్‌కి ముగ్గురు పిల్లలన్నాం. పెద్దవాడికి 16, రెండవ వాడికి 12, మూడవవాడికి 8 సంవత్సరాలు. ముగ్గురి మధ్య నాలుగేళ్ల వ్యత్యాసం వుంది. అదేవిధంగా పెద్దవాని వయస్సులో చిన్నవాని వయస్సు సగానికి సగం. సరిపోయిందికదా.

❋

ఆహా! విసనకర్ర!!



హలో నేస్తాలూ! ష్హు... అబ్బా... అప్పడే వేసవి కాలం వచ్చేసినట్టుంది కదూ. ఎండలు అదిరిపోతున్నాయి. ఇప్పడు మనకు విసనకర్ర బాగా ఉపయోగపడుతుంది. కరెంటు పోయినప్పడు ఎంచక్కా విసురుకుంటూ చదువుకోవచ్చు. అవునా! మరయితే ఇవాళ విసనకర్రను ఎలా తయారుచేయాలో చెప్పకుందామా!

ఏమేం కావాలంటే... మందపాటి చార్టు, ఒక అట్టముక్క (మీ నోట్‌బుక్‌కి వుంటుందే అది), క్రేయాన్లు, వాటర్ కలర్స్, గమ్, కత్తెర.

ఎలా చేయాలంటే... ముందు మీరు రకరకాల పక్షులను పరిశీలించి చూడాలి. వాటి తోకలకు ఈకలు ఎలా వుంటాయో గమనించండి. తర్వాత 2వ బొమ్మను పరిశీలించండి. అందులో విసనకర్ర ఆకులు ఎలా వున్నాయి? అచ్చంగా అలా... పైన కింద సన్నగా, మధ్యలో వెడల్పుగా వుండాలి. ఆ విధంగా చార్టును కత్తిరించండి. ఇలాంటి ఆకులు ఎనిమిది తయారు చేసుకోవాలి. వీటికి మీకిష్టమైన డిజైన్లు వేసి క్రేయాన్లు, వాటర్ కలర్స్‌తో రంగులు వేయొచ్చు. ఇప్పడు మీ నోట్‌పుస్తకం అట్ట ఒకటి తీసుకోండి. దాన్ని అర్ధచంద్రాకారంలో కత్తిరించుకోండి. మనం తయారుచేసుకున్న ఆకులను మూడో బొమ్మలో వున్నట్టుగా ఆ అట్టమీద అతికించండి. అంతే విసనకర్ర రెడీ. బాగా ఆరాక ఎంచక్కా దాంతో విసురుకోవచ్చు.

❋

చిన్నారి చిత్రకారులు

ధవళ సాయి సురేష్,
7వ తరగతి,
మెయిద,
విజయనగరం.



ఎం. శంకరమ్మ,
8వ తరగతి,
బైరవుని బండ,
శాలిగౌరారమ్,
నల్గొండ.



బి.పవన్‌కుమార్,
9వ తరగతి,
భవానీ
విద్యామందిర్,
నకిరేకల్,
నల్గొండ.

❋

టీనేజ్ రచయిత

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ఢిల్లీ పబ్లిక్ స్కూలు...

తెల్లని పువ్వుల్లా పిల్లలు వీపు వెనుక పుస్తకాల బ్యాగులు తగిలించుకుని వస్తున్నారు. అందరి మొహాల్లో ఉత్సాహం తొంగిచూస్తోంది. నవ్వుతూ తుళ్లుతూ గుంపులు గుంపులుగా వెళుతున్నారు.

స్కూలు బెల్లు కొట్టడానికి పావుగంట సమయం ఉంది.

ఎవరి క్లాసుల్లోకి వారు వెళ్లి తమ సీట్లలలో బ్యాగులను లంచ్ బాక్సులను పెట్టుకుని వరండాను అనుకుని ఉన్న గ్రౌండులోకి చేరిపోయారు. అక్కడ డ్రిల్లు టీచరు విజిల్ పట్టుకుని నిల్చున్నారు.

వారిని క్రమపద్ధతిలో నిల్చోబెట్టిన తర్వాత ప్రార్థన మొదలైంది. లయబద్ధంగా కోరస్‌లో దేశభక్తి గీతాన్ని ఆలపించారు. తర్వాత ఎవరి క్లాసులలోకి వారు వెళ్ళిపోయారు.

లెవెంత్ స్టాండర్డు క్లాసులో 40 మంది పిల్లలున్నారు.

అందరూ వరుస ప్రకారం కూర్చున్నారు. టైం ప్రకారం తరగతిలో పాఠం మొదలైంది.

ఉపాధ్యాయులు వివరంగా అన్ని విషయాలు చెబుతుంటే అంకిత్ ఫాడియా పుస్తకంలో రాసుకుంటున్నాడు. ముందువరసలో కూర్చున్న అతను మిగిలిన విద్యార్థులందరికన్నా భిన్నంగా ఉన్నాడు. పదహారేళ్ల టీనేజ్‌లో ఉన్న అంకిత్ నీలం రంగు జీన్‌ఫేంటుపైన తెల్లని టీషర్టు వేసుకున్నాడు. కళ్లల్లో చురుకుతనం, ఏ విషయాన్నయినా తెలుసుకోవాలన్న తపన మొహాన్ని చూస్తే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

సుతీర్థ బట్టాచార్య కంప్యూటర్‌సైన్సు పాఠం చెబుతున్నారు.

అంకిత్ విషయాన్ని శ్రద్ధగా ఆలకిస్తూ బోర్డుపైన రాస్తున్న విషయాలను తన నోటు పుస్తకంలో చకచకా రాసుకుంటున్నాడు.

ఇంతలో పోస్టుమేన్‌ను వెంటబెట్టుకుని కాలేజీ అటెండర్ క్లాసురూంకి వచ్చాడు.

క్లాసు మధ్యలో అంతరాయం ఏర్పడటం సుతీర్థ భట్టాచార్యకు చికాకు తెప్పించింది. "ఏమిటి?" అన్నట్లుగా వారిద్దరి వైపు చూశాడు.

"రిజిస్టర్డుపోస్టు!" అన్నాడు.

"స్టాఫ్ రూం వద్ద ఉండండి వస్తాను" అన్నారు.

"మీకు కాదుసార్. అంకిత్ ఫాడియాకు వచ్చింది ఈ లెటర్!" అన్నాడు పోస్టుమేన్.

శ్రద్ధగా రాసుకుంటున్న అంకిత్ తలెత్తాడు.

సుతీర్థ భట్టాచార్యా లెటర్ తీసుకోమని తలతోనే సైగ చేశారు. పుస్తకాలు సర్దుకుని అంకిత్ బైట వరండాలోకి వెళ్లాడు.

పోస్టుమేన్ బరువైన కవరు అందిస్తే సంతకం పెట్టి ఆత్రుతగా దానిని అందుకున్నాడు.

మేక్‌మిలన్ పబ్లిషింగ్ సంస్థ నుంచి వచ్చిన ఉత్తరం వెంటనే విప్పి గబగబా చదివాడు.

"కంప్యూటర్ విజ్ఞానం గూర్చి రాసిన మీ పుస్తకం అందింది. దానిని ప్రచురించడానికి మా పబ్లిషింగ్ సంస్థ ఆసక్తి చూపిస్తోంది. పుస్తకం పదివేల కాపీలు ప్రింటు చేయడానికి అనుమతి కోరుతున్నాం... ప్రింట్ చేసి అమ్ముడైన కాపీలకు కమీషన్, రాయల్టీలు మొదలైన వివరాలన్నీ కింద జతచేసి ఉన్నాయి. ఆమోదం తెలియజేయవలసిందిగా కోరుతున్నాం" అని పబ్లిషింగ్ సంస్థ యజమాని సంతకం పెట్టి ఉన్న రిజిస్టర్ ఉత్తరం అది.

ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివాడో అర్థం కాలేదు.

ఆనందంతో గుండె చప్పుడు పెరిగిపోయింది.

మనసులో అదోలాంటి ఆనందపు తెర కమ్ముకుంది.

మెదిలిన ఆనందాన్ని ఎలా పంచుకోవాలో అర్థం కాని పరిస్థితి ఎదురైంది. తాను రాసిన గ్రంథం ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందిన సంస్థ ప్రచురించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

కంప్యూటర్‌పై ఉన్న ఆసక్తితో తయారుచేసుకున్న నోట్సు... తన అనుభవాలు... కంప్యూటర్‌ను ఎలా వినియోగించాలి అన్న విషయాలపై సరదాగా రాసుకున్న విషయాలను ఆరువందల పేజీల్లో పుస్తకంగా తయారుచేసి ప్రచురణ కోసం పంపాడు.

పంపిన విషయం ఎప్పుడో మరిచిపోయాడు.

మనసులో మెదిలిన భావాలకు అక్షర రూపం ఇచ్చిన తర్వాత ఎందుకో అది ప్రచురణ జరిగితే ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందని అనిపించింది. ఆ కారణంగానే చేతిరాతను పంపించాడు. పంపించిన దానికి మంచి ఫలితం కనిపించింది.

పదహారేళ్ల అంకిత్ ఫాడియా జీవితంలో మేక్‌మిలన్ ప్రచురణ సంస్థ పంపిన లేఖ ఒక కొత్త మార్పును తీసుకుని వచ్చింది. అతి చిన్న వయసులోనే కంప్యూటర్ ప్రపంచానికి పాఠ్యపుస్తకాన్ని అందించిన ఘనత లభించింది.

అంకిత్ సృష్టించిన తాజా సంచలనానికి బీజం రెండేళ్ల క్రితం పడింది. అంకిత్ తండ్రి ప్రకాష్ ఫాడియా ఇంజనీరు. తల్లి మామూలు గృహిణి. అక్క అమి చార్టెడ్ ఎకౌంటెంటుగా పనిచేస్తోంది.

హైస్కూలులో చదువుతున్నప్పుడే కంప్యూటర్‌ను నిత్యజీవితంలో ఎలా వినియోగించు కోవాలో తెలుసుకున్నాడు. ఇంటిలో ఉన్న కంప్యూటర్‌ను నిత్యం వినియోగించుకోవడంతో దానికి సంబంధించిన



పరిజ్ఞానాన్ని సంపాదించాడు. అందులో భాగంగా స్వంత వెబ్‌సైటును ఏర్పాటు చేసుకోవాలనుకున్నాడు.

ఇంటిలో తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఎప్పుడూ కంప్యూటర్ అంటూ తిరగడం వారికి నచ్చలేదు. కంప్యూటర్ పిచ్చోడుగా అందరూ వేళాకోళం చేస్తారని చెప్పారు. అయినా అంకిత్ వినిపించుకోలేదు.

మొదట్లో కంప్యూటర్ గేమ్స్‌పై ఎంతో ఆసక్తి ఉండేది. కంప్యూటర్ ముందు కూర్చుని రకరకాల ఆటలను ఆడేవాడు. ఆటలన్నీ పూర్తయిపోయిన తర్వాత దానిపై థ్రిల్ తగ్గిపోయింది. తర్వాత ఇంటర్‌నెట్‌పై ఆసక్తి పెరిగింది. ఇంటర్‌నెట్ మొత్తం ప్రపంచాన్ని తన గదిలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేసింది.

కంప్యూటర్ ప్రపంచంలో ఒకొక్క విషయాన్ని నేర్చుకుంటున్న కొద్దీ అంకిత్‌లో ఉత్సాహం మరింతగా పెరిగిపోయింది. కంప్యూటర్ ఎన్ని పనులు చేస్తుందో అన్ని పనులను చేయించుకోవడంతో, కంప్యూటర్ అతని చేతిలో ఒక ఆటవస్తువు మాదిరిగా తయారైంది.

ఎవరూ చేయని పనిని తానే చేయాలని మనసులో దృఢ నిశ్చయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పట్టుదలతో కంప్యూటర్ మొత్తాన్ని ఔపోసన పెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలో "హాకింగ్" గూర్చి ఆసక్తి అంకిత్ జీవితాన్ని కొత్త మలుపుతిప్పింది.

అంకిత్ ఫాడియాకు హాకింగ్ గూర్చి అప్పటికి ఏమీ తెలియదు.

దానిని నేర్చుకోవడానికి ఎటువంటి పుస్తకాలు లేవు. నేర్పించే నిపుణులు కూడా ఎవరూ కనిపించలేదు. చాలామందిని సంప్రదించినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు.

కంప్యూటర్‌లో అనుసంధానం అయిన ఇంటర్‌నెట్‌లో వివిధ వెబ్‌సైట్లను ఓపెన్ చేసి వాటితో సమాచారాన్ని తెలుసుకోవడాన్ని "హాకింగ్" అంటారు. చాలామందికి ఈ విషయాలపై అంతగా ఆసక్తి ఉండదు.

ఇంటర్‌నెట్ ద్వారా రకరకాల సమాచారం తెలుసుకోవడానికి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి దీనిని ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఈ విధంగా వెబ్‌సైట్లను ఓపెన్ చేయాలంటే 'పాస్‌వర్డ్' తెలియాలి. ఈ వర్డ్ తెలిసినట్లయితే ఆ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్ని రకాల విషయాలను తెలుసుకోవచ్చు. ఈ పాసువర్డు ఒక తాళం చెవి లాంటిది. చాలామంది ఈ పాస్‌వర్డు సంపాదించి వెబ్‌సైట్‌లలో చొరబడుతుంటారు. ఈ విధంగా ప్రవేశించి అందులో సమాచారాన్ని అక్రమంగా ఉపయోగించుకోవడమే కాకుండా కొంతమంది మొత్తం సమాచారాన్ని నాశనం చేస్తుంటారు. చాలామంది రహస్య పాస్‌వర్డులను తెలుసుకుని కొంతమంది వెబ్‌సైట్లలోకి ప్రవేశిస్తుంటారు. ఇలా ప్రవేశించినవారు ఊరుకోకుండా వైరస్ మాదిరిగా వెబ్‌సైట్‌ను నాశనం చేస్తుంటారు. ఒకసారి నాశనం అయితే కష్టపడి ఫీడ్ చేసిన మొత్తం సమగ్ర సమాచారం అంతా తుడుచుపెట్టుకుని పోతుంది.

ఇటువంటి నేరగాళ్లకు "క్రాకర్లు" అని అంకిత్ పేరు పెట్టారు. అటువంటి వ్యక్తులను ఆ విధంగానే వ్యవహరించడం పరిపాటి అయిపోయింది. అంకిత్ గమనించిన థాయిలాండ్ ఉదంతం అతని మనసుపై తీవ్రముద్రను వేసింది.

థాయిలాండ్‌లో ఒక క్రాకర్ విసిరిన లవ్‌బగ్ వైరస్ దాటికి ప్రపంచం మొత్తంపైన ఎన్నో వెబ్‌సైట్లు తుడుచుపెట్టుకుపోయాయి. ఈ విషయం ఎంతో సంచలనం కలిగించింది. కంప్యూటర్లు ఉన్నవారు అందరూ ఉలిక్కిపడిపోయారు.

ఇలాంటి నేరాలను నిరోధించడానికి అసలు దొంగచాటుగా వెబ్‌సైట్లలోకి చొరబడే పద్ధతులు తెలియాలి. ఇది తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కావడంలేదు. ఈ విషయం అంకిత్ ఫాడియా మనసులో బలమైన ముద్ర వేసింది. ఈ విషయంలో ప్రజలందరికీ అవగాహన కలిగించడానికి తానే ఎందుకు పుస్తకం రాయకూడదని అనుకున్నాడు. తన ఆలోచన తండ్రి ప్రకాష్ ఫాడియా వద్ద వ్యక్తపరిచాడు.

కొడుకు పట్టుదల గురించి అతనికి బాగా తెలుసు. అందుకే నిరుత్సాహపరచలేదు. "కంప్యూటర్ నేర్చుకునే వయసులో కంప్యూటర్ పుస్తకం రాస్తానంటే ఎవరు వద్దంటారు. తప్పకుండా ముందుకు దూసుకుపో..." అని ప్రోత్సాహాన్నిచ్చాడు.

దాంతో అంకిత్ ఫాడియా విజృంభించాడు.

తన ఇంటిలో ఉన్న సొంత వెబ్‌సైట్ ద్వారా ప్రపంచంలో నలుమూలల్లో ఉన్న హాకర్ల నుంచి విస్తృతమైన సమాచారాన్ని సేకరించాడు. అందరి వద్దనుంచి లభించిన వివరాలను తన పుస్తకంలో నమోదు చేసుకున్నాడు.

వివిధ ప్రాంతాల నుంచి లభిస్తున్న ఒకొక్క వివరాలు తెలుసుకుంటుంటే అంకిత్‌కు ఎంతో ఆశ్చర్యం కలిగింది. వెబ్‌సైట్లను నాశనం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఆందోళన కలిగించాయి. ఇటువంటి విషయాలు కంప్యూటర్‌లో స్వంత వెబ్‌సైటు ఉన్న ప్రతివారికీ తెలియజేయాలని అనుకున్నాడు.

"ఇంటర్‌నెట్‌లో నేరం ఇలా జరిగేందుకు అవకాశం ఉంది. అది జరక్కుండా ఇలా జాగ్రత్తపడింది" అనే విధానంలో వివరాలన్నీ సేకరించాడు. అందరికీ అర్థమయ్యేరీతిలో సులభంగా రాశాడు. వివరాలన్నీ ఒక క్రమ పద్ధతిలో నమోదు చేయడంవల్ల అది సమగ్రంగా తయారైంది. మొత్తం 624 పేజీలుగా తయారైన ఈ పుస్తకాన్ని చాలామంది మెచ్చుకున్నారు. ఇది ప్రింట్‌అయి మార్కెట్‌లోకి వస్తే ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు.

చాలామంది సలహా మేరకు ప్రఖ్యాత పబ్లిషింగ్ సంస్థ "మేక్‌మిలన్" వారికి వివరాలు పంపించి పబ్లిషింగ్‌కోసం అభ్యర్థిస్తూ ఉత్తరం రాశాడు.

ఆ ఉత్తరానికి అనూహ్యస్పందన వచ్చింది.

ఆ సంస్థ పుస్తకాన్ని ప్రచురిస్తే ప్రపంచ వ్యాప్తంగా అందరి తలుపులు తడుతుందని తన అనుమతిని ఇస్తూ తిరుగుజవాబు రాశాడు అంకిత్‌ఫాడియా.

* * *

అంకిత్ ఫాడియా రాసిన "ది అనెథికల్ గైడ్ టు ఎథికల్ హాకింగ్" అనే పుస్తకం 2001 జూలై చివరి వారంలో మార్కెట్‌లో విడుదలైంది. అంతవరకూ ఇటువంటి పుస్తకాన్ని తీసుకువచ్చే ప్రయత్నాన్ని ఎవరూ చేయలేదు. విడుదల అయిన తర్వాత అందరి దృష్టి దీనిపైన పడింది. ప్రపంచం మొత్తంపై అమ్మకాలు విపరీతంగా జరిగాయి. విడుదలైన పదిరోజులు కాకుండానే కాపీలన్నీ అమ్మకం అయిపోయి రీప్రింటుకు రావడంతో ఈ పుస్తకం ప్రత్యేకత అందరికీ అర్థం అయిపోయింది. ఈ పుస్తకం ప్రచురించిన ప్రఖ్యాత ప్రచురణ సంస్థ మేక్‌మిలన్ నిర్వాహకులు కూడా ఆశ్చర్యపోయారు. తమ సంస్థ ప్రచురించిన ఏ పుస్తకానికీ ఇంతటి పాపులారిటీ రాలేదని వారు బహిరంగప్రకటన కూడా చేశారు.

ఈ విషయం సంచలనం అయిపోయింది.

బేకింగ్ ట్రూత్స్-బాక్స్‌ఎస్‌కె పేరుతో అంకిత్ స్వంతంగా ఒక వెబ్‌సైట్ రూపొందించాడు. ప్రపంచం మొత్తంపైన అతని పేరు మారుమోగిపోవడంతో ఈ వెబ్‌సైట్‌కి ప్రతిరోజూ లక్ష హిట్లుకు పైగా వస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారిక సంస్థలు కూడా ధృవీకరించాయి.

అమెరికాకు చెందిన ఎఫ్.బి.ఐ. అధికారి నిర్వహించే ఏన్షియన్‌లైన్. కాం అనే వెబ్‌సైట్‌కి మాత్రమే ఇన్ని హిట్లు వస్తున్నాయన్న రికార్డు ఉంది. ఈ రికార్డు అంకిత్ రూపొందించిన వెబ్‌సైట్ అధిగమించిందన్న విషయం అందరికీ ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ విషయాన్ని "న్యూయార్క్‌టైమ్స్" అనే అంతర్జాతీయ పత్రిక ఒక వ్యాసాన్ని రాసి అందులో పేర్కొంది. తమ తమ సంస్థలకు సలహాలు అందించేందుకు ప్రపంచంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు అంకిత్ కోసం పోటీపడుతున్నాయి. అమెరికాకు చెందిన పలు సెక్యూరిటీ సంస్థలు పదహారేళ్ల అంకిత్ సేవల కోసం ఎదురుచూస్తున్నాయి. అమెరికన్ గూఢాచారి సంస్థ ఎఫ్.బి.ఐ తమ దేశంలో ఏజంట్లు, టాప్ ఇంటిలిజెన్స్ అధికారుల కోసం 'ఇంటర్నెట్ హాకింగ్' అనే అంశం పై ఒక వర్కుషాపును నిర్వహించడానికి అంకిత్‌ను ఆహ్వానించారు. అంకిత్ అక్కడ కూడా తన పరిజ్ఞానాన్ని ప్రదర్శించి ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు పొందాడు.

* * *

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా విశాలమైన లాన్ సిమ్మెంటు బెంచిపై అంకిత్ ఫాడియా కూర్చున్నాడు.

అతని మనసులో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. పక్కన క్లాసు పుస్తకాలున్నాయి.

"ఏం అంకిత్! ఒక్కడే కూర్చున్నావ్?" సుతీర్థ భట్టాచార్య నెమ్మదిగా అంటూ అతని పక్కన వచ్చి కూర్చున్నాడు.

"ఏం లేదు సార్!" అన్యమనస్కంగా అన్నాడు.

"నువ్వు రాసిన పుస్తకం ఎంతోమంది మెచ్చుకున్నారు. నీకు కూడా పేరు తీసుకువచ్చింది. దిగులెందుకు?"

"చదువుకోసం సార్!"

"అంటే?"

"ఇంకా పై చదువులు చదవాలని ఉంది సార్! మీలాంటి సార్‌ల వద్ద మరిన్ని విషయాలు నేర్చుకోవాలని ఉంది. కానీ ప్రస్తుతం నాకు స్వేచ్ఛ లేకుండా పోయింది. అనుకోకుండా లభించిన గుర్తింపును తట్టుకోలేకపోతున్నాను" అంకిత్ కళ్లల్లో కన్నీళ్లు.

రెండు నిమిషాలు భట్టాచార్య ఏం మాట్లాడలేదు. తర్వాత అంకిత్‌కి మరింత దగ్గరగా జరిగి అతని భుజంపై మెల్లగా అనునయిస్తున్నట్లు తట్టాడు.

అంకిత్‌కి మరింత దుఃఖం తన్నుకువచ్చింది.

"ఈ పేరు... డబ్బు... అనుకోకుండా వచ్చిన గుర్తింపు నాకు వద్దుసార్! ఇంటిలో ఎవరూ లేకుండా అలసట వచ్చేంతవరకూ పాప్‌మ్యూజిక్ వింటూ గంతులు వేయాలని ఉంటుంది. ఇతర పిల్లలతో కలిసి పచ్చిక మైదానాల్లోంచి పరుగులు తీయాలని ఉంటుంది. క్రికెట్ ఆట ఆడాలని ఉంటుంది. సాయంత్రం పూట పార్కుల వెంట, పబ్‌ల వెంట తిరగాలని ఉంటుంది. కానీ నాకు స్వేచ్ఛ ఏదిసార్" గబగబా చెప్పుకొచ్చాడు.

"అంకిత్! నువ్వేం బాధ పడనవసరంలేదు. టైం మేనేజ్‌మెంటు తెలిస్తే ఎన్ని పనులనైనా చేయవచ్చు. నువ్వు రచయితను అయిపోయానని, స్వేచ్ఛని కోల్పోయానని, పంజరంలో చిలకను అయిపోయానని అనుకోవద్దు. టీనేజ్‌లో నీ సరదాలన్నీ తీర్చుకో. ఆ సమయంలో నీకు వచ్చిన గుర్తింపును సద్వినియోగం చేసుకుని పుస్తకాలు రాయి. గుర్తింపు వచ్చినప్పుడే నువ్వు చేసిన పనులకు విలువ ఉంటుంది. ఈ సమయంలో నువ్వు నీకొచ్చిన గుర్తింపుకు దూరమైతే ప్రపంచం నిన్ను మరిచిపోతుంది. సరేనా?" అంటూ లేచాడు.

సుతీర్థ భట్టాచార్య చేతిలో పుస్తకాలను ఊపుకుంటూ క్లాసు రూమువైపు అడుగులు వేశాడు. అంకిత్ అతని వైపు చూస్తుండిపోయాడు.

అతని కళ్లల్లో కొత్త వెలుగు వచ్చింది.

✣

అరటికాయ్ అంటే అయ్యబాబోయ్ అంటారేం!

పి. జ్యోతి

అదే నాకు అర్థంకావట్లేదు మరి!

ఆ మధ్య మా వారికి, పిల్లలకు వరుసబెట్టి మూడ్రోజులు శెలవులొచ్చాయి కదా.

మనూరెళ్దామండీ... అత్తగారిని, మామగారిని చూచికూడా చాలా రోజులయింది... వాళ్ళూ మనల్ని చూసి చాలా సంతోషిస్తారన్నాను.

మా వారు అలా షికారుగా నా మనస్సులోకి దూరి చూసొచ్చినట్లు మరీ మాట్లాడుతారు. గీతా ఇదంతా మా అమ్మానాన్నల మీద ప్రేమతోనేనా అని అడిగేశారు.

నాకొళ్ళు మండి కొరకొరా చూద్దామనుకున్నాను కానీ చూళ్ళేదులేండి. ఈ వంకతో వెళ్ళి, వచ్చేటప్పుడు అక్కడనుంచి ఇంటి పెరట్లో, తోటలో పండిన కూరలు, పండ్లు, కాయలు తేరగా తెచ్చుకుందామనే కదూ అని ఉన్నమాట అంటే ఎవరికైనా ఉలుకే కదా.

ఇక నాకప్పుడు నిజంగానే ఒళ్ళు మండింది. మండదు మరీ... అయినా అలా తెచ్చానే అనుకోండి... తప్పేంటి చెప్పండి. కూరగాయలు, పళ్ళూ రేట్లు ఆ వరసాన పెరిగిపోయి చస్తుంటే ఏదో రకంగా నేను అలా సర్దుబాటు చేశాననే అనుకోండి. ఆ నెల కొంతలో కొంత ఖర్చు తగ్గినట్లవుతుందా లేదా మీరే చెప్పండి.

వారలా అనగానే ఒప్పుకుంటే ఇంకేమన్నా ఉందా... చాల్లెండి మీ కంటికి అలా కనబడుతున్నానా... మన పెద్దాళ్ళ మీద నాకంత ప్రేమలేదనా... సరేలేండి మీకిష్టం లేకపోతే వెళ్ళొద్దులేండి అన్నానా... అంతే మంత్రం పారింది. నేననుకున్నది వర్కవుట్ అయ్యింది.

సారీ చెప్పించుకుని మరీ బయలుదేరేలా చేశా. సో... ఆ దారిలో నా దారికొచ్చారన్నమాట.

మావారి ఊరు వెళ్ళనూ వెళ్ళాం. ఓ రెండు రోజులు ఉన్నట్టూ అనిపించుకున్నాం.. బయలుదేరేటప్పుడు...

ఇదుగో అమ్మాయీ గీతా... మన తోటలో ఎప్పుడు అరటిగెల వేసినా ఊరంతటికీ పంచిపెట్టడమే అవుతోంది. ఈసారి గెల దించేటయానికి మీరొచ్చార్రా... మీరు పట్టుకెళితే నాకూ సంతోషంగా ఉంటుంది అని మా అత్తగారు అని నా పని ఎంతో సులువుచేశారు.

ఒక్క నాలుగు అరటికాయలు వాళ్లకోసం అట్టేపెట్టుకుని గెలంతా మమ్మల్ని పట్టుకెళ్ళమన్నారు మా అత్తవారు కాశీఅన్నపూర్ణమ్మవారు.

మా వారివైపు చూద్దునా... అప్పటికే నా తెలివితేటలకు మూర్ఛపోయేంతగా అచ్చెరువొందుతున్నట్లు మొహంపెట్టి నా వంక అప్పటికే చూస్తూ ఫ్రీజ్ అయిపోయారు. అంతట్లోనే తేరుకుని...

బాబోయ్ దీన్నెలా మోసుకెళ్ళడం... మనకోసం ఓ ఆరు అరటికాయలు పట్రా చాలు అన్నారు.

మీరు ఈ అరటిగెల తీసుకురాకపోతే మా అత్తవారు ఎంతో ఇష్టంగా ఇచ్చిన ఈ వందరిటికాయలూ అయిపోయేదాక ఇక్కడే ఉంటానులేండి... మీరూ, పిల్లలూ వెళ్ళిరండి అన్నాను.

కాస్త పెందాలాళే లేవండి... లేచి కాస్త స్నానంచేసి, పిల్లల్ని లేపి, వాళ్లకు పళ్ళు తోమి, నీళ్ళుపోయండి. చిన్నాడు బ్రష్ నోట్లో పెట్టుకుని కూడా నిద్రపోతుంటాడు. వాణ్ణి ఎత్తుకుని పళ్ళు మీరే తోమేయండి. వాడు రెండేళ్ళకెళితే సరిగ్గా కడుక్కుంటాడో లేదో ఆ కడుగుడేదో మీరే కానిచ్చేయండి. పాలమ్మాయి నీళ్ళు కలిపిందో లేదో చూసి మరీ పోయించుకోండి. ఇలా పనులు లిస్టు ఇంకా రోజులో మొదటి గంటదే కాలేదు... మా వారు హడలిపోయారనుకోండి.

అదికాదు గీతా... ఈ అరటిగెల ఎలా పట్టుకెళతామా... అని మాట సాగదీస్తుంటే మా అత్తమహాతల్లి... ఒరే వెంకూ నువ్వెందుకు మోస్తావురా... మన సుబ్బిగాడు బస్సుదాకా తెస్తాడు. ఆ తరువాత బస్సు మహానుభావుడు మోస్తాడు. మనం దిగీదిగకముందే ఆటో గావాలా ఆటో గావాలా అంటూ నీ చేతిలో బరువులన్నీ వాడే లాక్కుని తన ఆటోలో పెట్టుకుంటాడు. ఇంటి దగ్గరే కదా నువ్వు దించుకునేది. దానికిన్ని చదువుతావా అని గదిమింది.

ఆ మాట ధాటికి నిక్షేపంలా ఉన్న వందరిటికాయ గెల మా ఇంటికి చేరింది.

అన్ని కాయలు మనమొక్కరమే ఏం తింటాం... మన చుట్టుపక్కల వాళ్లందరికీ పంచేద్దాం అంటారాయన.

మీరూరుకోండి... అంతదూరం నుంచి మోసుకొచ్చింది అందరికీ తేరగా పంచడానికా... ఎంచక్కా ఫ్రిజ్‌లో పెట్టి రోజుకోరకం వెరైటీగా మనమే వండుకుతిందాం అన్నాను. హుందాగా నా వంక చూస్తున్న అరటిగెలను అపురూపంగా చూసుకున్నాను.

రోజుకోరకంగా అదేపనిగా అవే తింటుంటే మనకు 'అరటియాసిస్' అనే కొత్త జబ్బు వచ్చి కూర్చుంటుందేమోనే... అది తగ్గించడానికి డాక్టర్లు మందు కనిపెట్టలేక ఛస్తారే అని పెద్దగా జోకారు.

అయినా సరే ఊరుకున్నానా... చాల్లేండి.. మీ వన్నీ విద్దూరపుమాటలన్నాను. మీకేం తెలియదు... నా వంటల జోలికి మీరు రాకండి అని గదిమేశాను.

ఆ దెబ్బకు అప్పటికిక ఊరుకున్నారా... ఇక ఆ అరటికాయలతో రోజుకో రకం వంటకం మొదలెట్టేశాను. ఒకరోజు పలచగా రేకుల్లా తరిగి వేయించడం, మరోరోజు పెద్ద ముక్కలుగా కోసి, ముద్దకూరగా ఆ మర్నాడు, చిన్న ముక్కలుగా కోసి మసాలా పెట్టి ఇంకోసారి, ఆ మర్నాడు మామూలు సైజు ముక్కలు కూర్మాలాగా... ఇలా ఎన్ని రకాలుగా చేయగలిగితే అన్ని రకాలుగా కష్టపడి వండిపెట్టాను.

ఇంత కష్టపడితే... చూడండి ఏం జరిగిందో... కట్టుకున్న భర్తకూ, కనిపెంచిన సంతానానికి కూడా విలన్నయిపోయాను.

రాహులుగాడు... వెధవ ఏడేళ్ళు కూడా లేవు వాడికి... హోం వర్క్ చేసుకునే వాడల్లా ఒక్కసారిగా పెన్నుని చాకులా పట్టుకుని, "ఫిర్ వహీ అరిటికాయ కూర బనేగా... దేఖో క్యా హోగా" అని టీవీ సీరియల్ డైలాగ్ నామీదేస్తాడా?

పెద్దదానిక్కూడా నేనంటే శతృత్వమయిపోయింది ఏం చెప్పమంటారు?! అమ్మా... నాకు అన్నం దగ్గరకొస్తేనే అరటి వాసనొచ్చి వాంతి అయిపోయేంత డోకు అయిపోతోందే అనంటోంది.

మా శ్రీవారైతే ఏకంగా ఫోను బెదిరింపులు... నువ్వు అరటికాయ వండనంటేనే ఇంటికి భోజనానికి వస్తానన్నారు.

ఆఖరికి ఏమైందంటే...

దాహం వేసిందిగావాల్నా... మా వారు మంచినీళ్ళ బాటిల్ కోసమని... ఫ్రిజ్ తెరిచారంతే...

వారు నోరు తెరిచేలోపలే... నా తప్పు నేనొప్పేసుకుంటూ... మీరన్నదే జరిగిందండీ... భలే కరెక్టుగా చెప్పారే... కాయలన్నీ ఒకసారే పండిపోయి చచ్చాయి ఏం చెయ్యమంటారూ... మీరు చెప్పినట్లు అందరికీ పంచేసుంటే ఇలా పారేయాల్సివచ్చేదీ కాదు. మనమిచ్చామని చెప్పి రేపొద్దున్న మనకీ ఏవన్నా ఇచ్చేవారు...

ఈసారి అలా చేయనులేండి... కావాలంటే మళ్ళీ మీ ఊరునుంచి అరటిగెల తెచ్చిచూడండి... అని నోరుజారేశాను.

మా ఇంటిల్లిపాదీ "మళ్ళీ అరటికాయలే... అయ్యబాబోయ్" అనరిచారు. ✤

రైతంటె ఒగ ప్రేమగాడు

డా॥ కాలువ మల్లయ్య

"అబ్బ... గా సారుకు రైతంటె ఒగ ప్రేమగాడు. గయినె పరిపాలన చేసినన్ని దినాలు ఒక్కరైతుగూడ సచ్చిపోలేదు. అయినె దిగి పెయినంకనే అంత గడబెడయితంది. మస్తుమంది రైతులు జత్తున్నరు... అది ఉత్తుత్త సావుగాదు. అప్పులు గట్టలేక ఆత్మహత్యలు చేసుకోని సత్తున్నరు... పాపం గివ్విజూత్తాంటె గా సారు కండ్లపొంటి ఒగ కన్నీరుం కారుతలేదు...! గింతేననుకున్నరా ఏంది...? అయినె దిగిపెయినంక ప్రజలకు అన్ని కష్టాలే మొదలయినయి... గా సారున్నప్పుడు ఫ్యాక్షనిజమన్న మాటే వినక పోవునట. ఇప్పుడు గా పేరుమీద నరుక్క సత్తంద్రు. మస్తు దుఃఖపడుతండు... ఎక్కడ రైతు సచ్చిపెయినా, ఫ్యాక్షనిజంల నరుక్క సచ్చినా భలే సంబురంగ గక్కడికురుకుతండు... గా సంగతులన్ని తెల్లగోలుగ తెల్సెటట్టు జెనాలకెరుక జేత్తండు. గిండ్ల మస్తుగ ఉత్సాహం చూపుతండు. ఏం లీడరనుకున్నరయినెను...? తన పరిపాలనల ప్రజలకు స్వర్గమే చూపెట్టిండు. తన నోడించి ప్రజలు నరకాన్ని కొని తెచ్చుకున్నరని తెగ బాధపడిపోతున్నడు. తన పార్టీని ఓడించి ప్రజలు తెల్లారినుంచే మస్తు బాధపడ్తున్నరని గూడ అయినె బాధపడ్తండు. గాల్ల చావులు సూత్తాంటె ఈనెకు వెంటనే అధికారంకచ్చి అన్ని మంచిగ చెత్తున్ననున్నదట. మరి గాల్లెందుకు దిగిపోతరు...? ఐదేండ్లో పదేండ్లో ఎదిరు చూసే ఓపిక గా లీడరుకు లేదుగద..." అన్నడు కొండారెడ్డి.

గా మాటలకు గంయ్‌మని లేచిండు పి.వి.రావ్.

"మా చెప్పినవ్ తియ్యరోయ్ కొండారెడ్డి...! ఎటకారంగ మాట్లాడుడు నీకే వస్తదనుకుంటన్నవా...? మరి గిప్పుడు రైతుల ఆత్మహత్యలు జరుగుత లెవ్వా...? ఫ్యాక్షన్ కొట్లాటలయిత లెవ్వా...? సరె గప్పుడు స్వర్గం లేదుం. మరి గిప్పుడుందా...? గయినె ప్రత్యక్షనరకం చూపెట్టిండంటవు మరి గీనె చూపెట్టేదేంది... అరచేతిల స్వర్గమే కాద...? గింతదానికి ఈల్లు రాంగనే ప్రజల సమస్యల్ని పరిష్కారమయినట్టే చెప్పవట్టివి. వ్యంగ్యంగ మాట్లాడవట్టివి. రైతుల ప్రభుత్వమే అయితె గాల్లెందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు...? మరా రైతులకు వీళ్ళు చెప్పినట్టు నష్టపరిహారం ఇస్తున్నరా? వీళ్ళేమో చేసినట్టు బాగ మాట్లాడవట్టివి. ఎవ్వలైన చెప్పేటెయి శ్రీరంగనీతులు, చేసేటియి బూతు పనులన్నట్టే ఉంది కథ..." అన్నడు.

గా మాటలకు పక్కడ పక్కడ నవ్వబట్టింద్రు సానమంది.

ఏంది మందిల భాగోతమన్నట్టు కొండారెడ్డి గూడ నవ్విండు.

"ఆ మాట నిజమేకని ఎవ్వలు పొడిసేదేం లేదు. కొంత కుడి ఎడుమలు గంతే... అవ్వకు బుట్టిన నలుగురు పరమ భాగోతులన్నట్టే ఉన్నయ్ మన రాజకీయాలు..." అన్నడు లచ్చిరెడ్డి.

"కావచ్చు... కాని రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నరంటె బలిసి చేసుకుంటున్నరనె ఒగయినె. అసలు నా పాలనల ఆకలే లేదనె ఇంకొగయినె... రైతులేంది, ఆత్మహత్యలు చేసుకునుడేందిఅదంత వట్టిదే అనె, వాళ్ళకు పైసలిచ్చుడు దండుగనె ... కరెంటిచ్చుడు గూడ దండుగే అనె...గా ఫ్యాక్షన్ల సంగతి గూడ గంతేననె... ఏమన్నంటె ప్రతిపక్షపోల్ల కుట్రనె... తన మాట విననోల్లందరిని దేశద్రోహులనె...

మరి గీల్లున్నరనుకుందాం...

ఆత్మహత్యలు జరుగుతున్నయంటె ఒప్పుకుంటున్నరు గద... స్పందించాల్సినంత కాకున్నా కొంతయిన స్పందిస్తున్నరు గద...! అందరికి గాకున్నా కొందరికయిన నష్టపరిహారం ఇస్తున్నరు గద...! గిది కొంతయిన నయ్యమేనంటావా కాదా..?

రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులుండుడు దారుణమైన విషయం. అన్నదాతల గీ పరిస్థితిని చూసి దేశం సిగ్గుతో తలదించుకోవాలె... పాలకులు సిగ్గుపడాలె... గీ సంగతి కాదంటలేను. అయితె గదాని కోసమే జెయ్యాలె...? వాళ్ళెందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నరో తెలుసుకోవాలె. అసోంటి పరిస్థితులు లేకుండ జెయ్యాలె. సాధ్యమయినంత వరకు ప్రయత్నమన్న చెయ్యాలె. అదేం లేకుండ ఇదంత వట్టిదే, ప్రతిపక్షపోల్ల కుట్రంటె సరిపోతదా...? వీళ్ళు సొక్కం వూనలని చెప్పుతలేనుగని ప్రయత్నమైతె సేత్తున్నరుగద...!

అప్పుడేమో గట్లజెసి ఇప్పుడేమో గురువింద గింజలెక్క మాట్లాడితేమన్నట్టు...? ప్రతిపక్షంలకు రాంగనే వేషం మార్చినట్టు సేత్తేమన్నట్టు...? ఇవ్వన్ని ఇయ్యాల్లనే వచ్చినయా... ఒక్కరోజులో పోతయా...? చిత్తశుద్ధితోని కోశిశ్ జేత్తె గివ్వన్నీటిని కొంతకాలం ఆపచ్చుకని ఒక్కసారే తీసేసినట్టు పోవన్నంటె పోవుగద...? గీ రాజకీయ నాయకులు ఏ పార్టోల్లన్న కానియ్... అధికారంలున్నప్పుడోటి, లేనప్పుడింకోటి మాట్లాడ్తేమన్నట్టు...? రైతుకు ఉచిత విద్యుత్ ఇచ్చుడే దండుగన్న నాయకులే ఈరోజు బల్సిన రైతుకు గూడ ఇయ్యాలెననవట్రీ... చిన్నరైతుకిచ్చినా మంచిదేకని, బల్సిన రైతుకియ్యకుంటేంది...? గీల్ల సంగతులెట్లున్నయంటె సాయి సంసారే కని లచ్చే దొంగన్నట్టున్నయ్" అన్నడు కొండారెడ్డి.

"సరే... మాటలకేంది...? బాగానే మాట్లాడచ్చు... రైతుబంధువులమని చెప్పుకుంటునోల్ల పాలనల వందలకొద్దిమంది రైతులు చచ్చుడేంది...? గిదేనా రైతు బంధువుతనం..." అన్నడు పి.వి.రావ్.

"అవును... ఇది ఖచ్చితంగ అవమానకరమే... కాని రైతును చాలా కాలంగ నిర్లక్ష్యం చేసిన ఫలితమే ఇది. మన పంటలు పండించద్దనిరి... ఫారినోల్ల లెక్క పండించాలనిరి... సబ్సిడీలు దండుగనిరి. అసలు దేశీయ వ్యవసాయమే వద్దనిరి. గిట్టుబాటుధరలు లేకపాయె. గా కరెంటన్న ఇయ్యమంటె గుర్రాలతోని తొక్కిచ్చిరి. మన భూమిల మన పంటలే పండిచ్చద్దంటె ఇంగేమయితది...? అవ్వన్నీటి ఫలితమే గిది.

వాటన్నిటి ప్రభావం పోవన్నంటె ఒకటి రెండు సంవత్సరాలన్న పడుతది. అప్పుడుగూడ ఆత్మహత్యలు ఏదో మేరకుంటయి. అయితె వాటిని ఎట్ల తీసుకుంటున్నరన్నదే ముఖ్యం. పోతె లక్షరూపాయలిస్తున్నారంటె ఆత్మహత్యయినా చేసుకునే పరిస్థితిలున్న వాళ్ళు ఈ దేశంల చాలామందే ఉండటం మన దౌర్భాగ్యం. కాని ఇది వాస్తవం.

ఎన్నికలల్ల ఓడుడు, గెలుసుడనేది ముఖ్యంకాదు. ఎవరో ఒగరు గెలుస్తరు... ఓడుతరు... కాని ఎవరు గెలిచినా ఓడినా దేశానికి అన్నమందించే అన్నదాతను పట్టించుకోని వాళ్ళకు పుట్టగతులుండయి... ఎవ్వలధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలున్నా అన్నదాతే అన్నవెూ రామచంద్రంటె పట్టించుకోకుంటె వాళ్ళు గూడ అన్నమో రామచంద్రనక తప్పదు... ఇది నిజం..."

అన్నడు రాజమల్లు...

"రైతుల మీద ప్రేమున్నట్టు నటించుతె ఐపోతదా..."

"రాజకీయంల ఉన్నోల్లకు నటన అలువాటేనన్న విషయం ఎరికే కద పి.వి.రావ్...! కని ఎవ్వలు నట్టిన్తున్నరో, ఎవ్వలు హృదయపూర్వకంగంటున్నరో, చేస్తున్నరో ప్రజలు గమనిస్తురన్న సంగతి యాదికుంచుకుంటె మంచిది" అన్నడు రాజమల్లు.

✤



మూత్రములో...ఆల్బుమిన్ పరీక్ష

వ్యాధుల నిర్ధారణలో మూత్రానికి కూడా ఎంతో ప్రాధాన్యత వుందన్న విషయం మనందరకు తెలిసిందే. నిజానికి మూత్రానికి అనేక పరీక్షలు నిర్వహించవచ్చును. అవన్నీ వ్యాధుల నిర్ధారణంలో ఎంతగానో దోహదపడతాయి. అయితే వీటిలో చాలా పరీక్షలను చాలా అరుదుగా చేయడం జరుగుతుంది. ఆ పరీక్షలు, సదుపాయాలు పెద్ద పెద్ద లేబోరేటరీలలో మాత్రమే లభ్యమవుతాయి. సాధారణ మూత్ర పరీక్షలు మాత్రం ప్రతి లాబొరేటరీలోను నిర్వహించడం జరుగుతోంది. సాధారణ లేబొరేటరీలలో నిర్వహించే మూత్ర పరీక్షలలో యూరిన్ షుగర్, అల్బుమిన్, మైక్రోస్కోపి, యూరోబిలినోజన్, బైల్‌సాల్ట్స్, బైల్‌పిగ్మెంట్స్, కల్చర్ / సెన్సిటివిటి పేర్కొనదగినవి. ఈ పరీక్షలలో ప్రస్తుతం మూత్రంలో అల్బుమిన్ పరీక్ష గురించి తెలుసుకుందాం.

మూత్రాన్ని ఫ్రెష్‌గా పరిశుభ్రమైన బాటిల్‌లో సేకరించాలి. సేకరించిన వెంటనే పరీక్షించాలి. పరీక్ష ఆలస్యం అవుతుంటే రిఫ్రిజిరేటర్‌లో నిల్వవుంచాలి. లేకపోతే మూత్రం ఆమ్ల, క్షార గుణాలలో మార్పులు వస్తాయి. సూక్ష్మజీవులు వృద్ధి చెంది మూత్రం కంటామినేట్ అవుతుంది. కల్చర్ సెన్సిటివిటికి మూత్రాన్ని స్టెరైల్ బాటిల్‌లో సేకరించాల్సి వుంటుంది.

లేబొరేటరీలలో యూరిన్ ఆల్బుమిన్ పరీక్ష అతి సాధారణ (రొటీన్) పరీక్ష. ఇది చాలా సులభతరమైనది. టెస్ట్‌ట్యూబ్‌లోకి మూడింట రెండు వంతులు (5-10మి.లి.) యూరిన్ తీసుకొని, మూత్రం పై భాగంలో పరీక్షనాళికను హీట్‌చేయాలి. క్రింది భాగం హీట్ చేయకూడదు. ఈ భాగం పరీక్షకు కంట్రోల్‌గా ఉపయోగపడుతుంది. హీట్ చేసిన తర్వాత, ఆ భాగంలో పరీక్ష నాళికలో ప్రెసిపిటేట్ (టర్బిడిటి) ఏర్పడితే.. మూత్రంలో ఫాస్ఫేట్స్‌గాని, కార్బొనేట్స్‌కాని, ఆల్బుమిన్ వంటి ప్రొటీన్‌కాని వున్నాయని తెలుస్తుంది. ఈ ప్రెసిపిటేట్‌కు 10 శాతం ఎసిటిక్ యాసిడ్ కలపాలి. ఎసిటిక్ యాసిడ్ కలిపిన తర్వాత ప్రెసిపిటేట్ కరిగిపోకుండా వుంటే ఆ ప్రెసిపిటేట్‌కు కారణం ప్రొటీన్ (అల్బుమిన్) అని తెలుస్తుంది. ప్రెసిపిటేట్ సాంద్రత, స్థాయినిబట్టి ఆల్బుమిన్ స్థాయిని 1 ప్లస్, 2ప్లస్, 3 ప్లస్, 4 ప్లస్‌గా రిపోర్ట్ చేస్తారు. యూరిన్‌లో ఆల్బుమిన్‌ను గుర్తించేందుకు సల్ఫోశాలిసిలిక్ యాసిడ్ పరీక్ష, పేపర్ స్ట్రిప్ పద్ధతి (యూరిస్టిక్స్) వంటి పద్ధతులు చాలా వున్నాయి. అయితే ఇక్కడ అన్నీ లాబొరేటరీలలో నిర్వహించే అతి సాధారణ పరీక్షను మాత్రమే ప్రస్తావించడం జరిగింది.





మూత్రంలో ఆల్బుమిన్‌కు కారణాలేమిటి?

ఆరోగ్యవంతులలో సాధారణంగా మూత్రంలో ఆల్బుమిన్ వుండదు. అయితే ఆరోగ్యవంతులలో కూడా కొంత మందిలో మూత్రంలో ఆల్బుమిన్ ఉండవచ్చును. ఈ పరిస్థితులనే ఫిజియోలాజికల్ కండిషన్స్‌గా పేర్కొంటారు. ఈ ఆల్బుమిన్ స్థాయి చాలా తక్కువగా వుంటుంది. వ్యాయామం చేసినప్పుడు, సాంద్రత పెరిగిన యూరిన్, జ్వరం, స్ట్రెస్, స్ట్రెయిన్‌కు గురి కావడం, ఆహారంలో అత్యధికంగా మాంసకృత్తులు తీసుకోవడం వంటి సందర్భాలలో ఆరోగ్యవంతుల మూత్రంలో ఆల్బుమిన్ కొద్ది పరిమాణంలో వుండవచ్చును.

వ్యాధుల కారణంగా మూత్రంలో ఆల్బుమిన్ ఉండడాన్ని పెథాలజికల్ కండిషన్‌లుగా పేర్కొంటారు. వీటిలో దీర్ఘకాల మధుమేహం, రక్తపోటు, కొన్ని రకాల మందుల వాడకం, యూరినరీట్రాక్ ఇన్‌ఫెక్షన్‌లు, దేహంలో రక్తకణాల అసాధారణ విచ్ఛిత్తి (హిమోలైసిస్), హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ సంబంధ వ్యాధి అయిన నెఫ్రొటిక్ సిండ్రోమ్, మొదలయినవి పేర్కొనదగినవి.

లాబొరేటరీలలో సాధారణంగా నిర్వహించే ఆల్బుమిన్ పరీక్షలలో మూత్రంలో ఆల్బుమిన్ స్థాయి 300మి.గ్రా. మించితేగాని గుర్తించలేము. అంటే అంతకంటే తక్కువ స్థాయిలో మూత్రంలో ఆల్బుమిన్ పోతుంటే పై పరీక్షల ద్వారా గుర్తించలేము అయితే మూత్రంలో 1మి.గ్రా ఆల్బుమిన్ పోతున్నా గుర్తించే ఆధునిక పద్ధతులు నేడు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరీక్షలను రేడియో ఇమ్యునోఅస్సే పద్ధతిలో నిర్వహిస్తారు. దీనినే మైక్రో అల్బుమినూరియా పరీక్షగా పేర్కొంటారు. ఈ పరీక్షల సదుపాయం పెద్ద పెద్ద లేబొరేటరీలలోనే లభ్యమవుతుంది. వ్యక్తిలో 1రోజు అంటే (24 గంటలు)లో వచ్చే మొత్తం మూత్రాన్ని పూర్తిగా సేకరించి, ఆ మూత్రంలోంచి కొద్దిగా మూత్రం తీసుకుని పరీక్షించి, 24 గంటలలో మొత్తం ఎంత ఆల్బుమిన్ పోతుందో లెక్కిస్తారు. దీనినే 24 అవర్స్ యూరినరీ ప్రొటీన్‌గా పేర్కొంటారు. ఏది ఏమైనా వ్యాధులనిర్ధారణలో, చికిత్సలో మూత్రంలో ఆల్బుమిన్ పరీక్షకు ఎంతో ప్రాధాన్యత వున్నది. ✤

స్పెషలిస్టుల సేవలు ఎప్పుడు అవసరం?

డా॥ నాగినేని భాస్కరరావు

డాపు శరీరంలోని అన్ని ధాతువుల, శాఖల జబ్బులకు ఒక స్థాయి వరకు కుటుంబవైద్యుడు లేక జనరల్ ప్రాక్టీషనర్ చికిత్స చేయగలడు. అయితే ఆయన పరిధి దాటాక లేక ప్రత్యేక అవయవం లేక శాఖకు సంబంధించిన జబ్బుల విషయంలో కుటుంబవైద్యుడు లేక జనరల్ ప్రాక్టీషనర్ దానిని నయం చేయలేనపుడు స్పెషలిస్టు అవసరం వస్తుంది.

నేడు శరవేగంగా పెరుగుతున్న వైద్య విజ్ఞానం ఆధునికత దృష్ట్యా కూడా రోగులు కొందరు నేరుగా స్పెషలిస్టు డాక్టర్లను సంప్రదిస్తున్నారు. ఉదా: కీళ్ల నొప్పులకు సంబంధించి ఎముకల వైద్య నిపుణుడి వద్దకు, నరముల బలహీనతకు న్యూరాలజిస్టు, కడుపు, కాలేయానికి సంబంధించి గ్యాస్ట్రో ఎంటరాలజిస్టును, చర్మవ్యాధులకు చర్మవైద్యనిపుణుడు కంటికి సంబంధించి కంటి వైద్యునిపుణుడు, చెవి, ముక్కు గొంతులకు ఇ.ఎన్.టి. స్పెషలిస్టు, స్త్రీలకు స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు – అలా ఇంకా అనేక శాఖలకు స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులు ఉన్న ఈ కాలంలో రోగులు తమ స్థోమత లేక ఉత్సాహాన్ని బట్టి నేరుగా కొందరు, ఎవరోచెపితే కొందరు ఆయా స్పెషలిస్టులను సంప్రదిస్తున్నారు.

సాధారణంగా ఈ క్రింది పరిస్థితులలో స్పెషలిస్టులను సంప్రదించాలి.

☆ గుండెనొప్పి లేక రక్త పోటు లేక పక్షవాతం లేక క్యాన్సరు జబ్బుతో బాధపడుతున్నపుడు.

☆ అసాధారణ జబ్బువచ్చినపుడు ముఖ్యంగా అటువంటి జబ్బును కుటుంబవైద్యుడు చికిత్స చేసే పరిస్థితిలేనపుడు.

☆ కుటుంబవైద్యునివద్ద ఎన్నో రకాల మందులు ఎంతో కాలం వాడినా జబ్బుతగ్గనపుడు లేదా జబ్బు తీవ్రమైనపుడు.

☆ కుటుంబ వైద్యుడు చేయించిన పరీక్షలలో వ్యాధి నిర్ధారణ కానప్పుడు.

☆ రోగికి జరుగుతున్న వైద్యాన్ని రోగి పరిశీలించుకున్నాక అది పూర్తిగా, సమగ్రంగా లేదని రోగి భావించినపుడు.

☆ రోగి ప్రశ్నలకు, అనుమానాలకు కుటుంబవైద్యుడు సరిగా జవాబు ఇవ్వనపుడు/ఇవ్వలేనపుడు.

☆ రోగి పరిస్థితిని బట్టి, ఆర్థిక పరిస్థితిని బట్టి, వృత్తిలో చేయవలసిన పనినిబట్టి ఉదా: అంతర్జాతీయస్థాయిలో ఒక క్రీడాకారుడు చీలమండ బెణికినా ఎముకలవైద్య నిపుణుడికి సంప్రదిస్తాడు. సామాన్యుడు అలా చేయలేడు.

☆ యాక్సిడెంటు అయి ఎముకలు విరిగినపుడు ఎముకల వైద్య నిపుణుడి వద్దకు

☆ ఇన్స్యూరెన్సు పథకాల ప్రకారం కొన్ని జబ్బులకు స్పెషలిస్టు చికిత్స అవసరమని సూచించినపుడు.

☆ చిన్నపిల్లల (అత్యవసర) సేవలకు – పిల్లల వైద్యనిపుణుడి వద్దకు

☆ మందులకు లొంగని వ్యాధులకు శస్త్ర చికిత్సవైద్య నిపుణుడివద్దకు మొదలైనవి.

స్పెషలిస్టును ఎలా ఎన్నుకోవాలి?

✪ మెడికల్ ఇన్సూరెన్సు ఉన్నవారు లేక బాగా డబ్బున్నవారు స్పెషలిస్టులనెలాగైనా ఎందరినైనా సంప్రదించవచ్చును.

✪ కుటుంబ వైద్యుని సలహాతో స్పెషలిస్టునుగాని సూపర్‌స్పెషలిస్టునుగాని సంప్రదించవచ్చును. రోగికి గట్టిగా సిఫారసు చేసే వారు ఎవరూలేని పక్షంలో రోగి తెలిసిన వారిద్వారా స్పెషలిస్టువద్ద పనిచేస్తున్న సిబ్బందితో ఒకరిని ఎన్నుకొని ఈ క్రింది సమాచారాన్ని సేకరించాలి.

✪ ఆ స్పెషలిస్టు లేక వైద్యునిపై ఏమైనా రోగుల ఫిర్యాదులున్నాయా? అక్రమ ప్రాక్టీసుకు సంబంధించి కోర్టు కేసులు ఏమైనా వున్నాయా?

✪ వైద్య విజ్ఞానం, నేర్పుపరంగా ఆస్పెషలిస్టుకు మంచి ఖ్యాతి వున్నదా?

✪ ఇతర స్పెషలిస్టును ఆయన సంప్రదించడానికి, రోగులను అవసరమైనపుడు ఇతర డాక్టర్లకు రిఫర్‌చేస్తారా?

✪ చివరగా స్పెషలిస్టు తన వృత్తికి సంబంధించిన సంఘాలలో సభ్యుడిగా చేరారా? తన శాస్త్రంలో ఇటీవల వచ్చిన పరిశోధనలను తెలుసుకుంటున్నారా.

✪ రోగి సమస్యపట్ల అతడు / ఆమె ఎంత అనుభవం గడించారు?

✪ శస్త్ర చికిత్సవైద్య నిపుణుడైతే ఆయన / ఆమె ఎన్ని ఆపరేషన్లు చేశారు? ఎన్ని విజయవంతం అయ్యాయి? అనుభవం పెరిగిన కొద్దీ విజయాల శాతం ఎక్కువై కాంప్లికేషన్సు తక్కువగా వుంటాయి.

✪ ఈ విషయంలో రోగి తన కుటుంబవైద్యుని సహాయ, సహకారాలు కోరాలి. అలాగే ఏ ఆస్పత్రిలో ఆమె/అతడు ఆపరేషను చేస్తారు? అక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయా? లేదా? మంచి సదుపాయాలున్న ఆస్పత్రులు మంచిడాక్టర్లను ఆకర్షిస్తాయి.

పై వివరాలను సాధ్యమైనంత వరకు సేకరించుకుని స్పెషలిస్టు డాక్టరునుగాని సూపర్‌స్పెషలిస్టు డాక్టరునుగాని రోగి ఎన్నుకొని సంప్రదించాలి. ✤



"దీపధారులు
(20వ శతాబ్ది తెలుగుకథకులు).
రచన: కేతువిశ్వనాథరెడ్డి.
ప్రచురణ: సాహితీస్రవంతి
వెల: 20రూ. పేజీలు:46
ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

దీపధారులు

తెలుగుకథకు ఒక ఉన్నత స్థాయిని కల్పించి, రాబోయే తరానికి మార్గ దర్శులుగా నిలిచిన ప్రముఖ కథకులను విశ్లేషణాత్మకంగా పరిచయం చేసే వ్యాసాల సంపుటి ఇది.

విస్తృతంగా రాసిన శ్రీపాద, గురజాడ, చలంలతో పాటు కేవలం ఐదు రాసిన గురజాడ వరకు వారి సాహిత్య మూర్తిమత్వాన్ని ఈ చిన్ని వ్యాసాలలో కుదించడం గొప్ప ఫీటే. ఆయా రచయితల వ్యక్తిత్వాలను, రచనలను, మేధాశక్తిని విశ్లేషించి వాటి అంతర్యాన్ని ఈ చిన్ని వ్యాసాలలో తెల్పిన విధానం బాగుంది. నిజానికి వ్యాసానికి పెట్టిన పేరులోనే దాని సారాంశమంతా ఇమిడివుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఉదా: తెలుగుకథను తీర్చిదిద్దిన గురజాడ, అచ్చమైన దేశీయ కథకుడు శ్రీపాద, సంకెళ్ళులేని స్వేచ్ఛను స్వప్నించినచలం, చింతనా నిరంతరం గోపీచంద్, అంతరంగమర్మాలను శోధించిన బుచ్చిబాబు, సామాజిక న్యాయవాది రావిశాస్త్రి, తెలుగు కథానూతుడు మధురాంతకం మొదలైనవి.

ఆకాశవాణి ప్రసంగ వ్యాసాలు కాబట్టి క్లుప్తతకు ప్రాధాన్యతనిచ్చిన ఈ వ్యాసాలు విశ్లేషణలు కూడా ఎన్నదగినవి. ఈ వ్యాసాలను గాలికి పోకుండా పుస్తకరూపంలో తెచ్చినందుకు సాహితీ స్రవంతిని అభినందించాల్సిందే.

కె.పి. అశోక్‌కుమార్

సాహితీ ప్రముఖుల ఇంటర్వ్యూలు



తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్న హేమాహేమీల్లాంటి సాహిత్యకారులతో చేసిన ఇంటర్వ్యూలను ఒక దగ్గరగా చేర్చి సాహితీస్రవంతి వారు ఇలా పుస్తకంగా వెలువరించారు.

ఇందులో మహీధర రామమోహనరావు, రంగనాయకమ్మ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, దాశరథి రంగాచార్య లాంటి నవలాకారులు, వేగుంట మోహనప్రసాద్, సి. నారాయణ రెడ్డి, శేషేంద్రశర్మ, కె.శివారెడ్డి లాంటి కవులున్నారు. దాంతోపాటు ప్రజాకళా కారులు గద్దర్, సీనియర్ జర్నలిస్ట్ - ఎడిటర్ సి.రాఘవాచారిగార్ల ఇంటర్వ్యూలు కూడా ఇందులో చోటుచేసుకోవడం విశేషమే.

చాలావరకు ఇంటర్వ్యూలు పేరుతో వచ్చేవన్నీ ఒక ఫార్మాట్‌కు లోబడివుంటాయి. ఒక ప్రముఖుడిని ఇంటర్వ్యూ చేయాలంటే ఇంటర్వ్యూ చేసే వ్యక్తిని కూడా ఆ వ్యక్తి గురించి, అతని కృషి గురించి సంపూర్ణ అవగాహన ఉన్నప్పుడే ఆ ఇంటర్వ్యూల ద్వారా పాఠకుడు ఎన్నో కొత్తసంగతులు తెలుసుకోగలుగుతారు. భజనలను, స్తోత్ర పాఠాలను కూడా ఇంటర్వ్యూల పేరుతో హంగామా చేసే అభిమానులకు కూడా కొదవలేదు. కాని వాటిన్నింటికి భిన్నంగా తెలికపల్లి రవి ఆయా సాహిత్య ప్రముఖుల జీవితకాల కృషిపట్ల వున్న అవగాహనతో వాళ్ళ వ్యక్తిత్వంలోనూ, సాహిత్యకృషిలోనూ దాగివున్న బహుముఖ్యతను పాఠకులకు పరిచయం చేయగలిగారు. మహీధర, గద్దర్, దాశరథి రంగాచార్యలాంటివాళ్ళు ఇంతకుముందు ఇచ్చిన ఇంటర్వ్యూలు వేరు. ఈ ఇంటర్వ్యూలు వేరు. సాధారణంగా ఎవరికీ ఇంటర్వ్యూ ఇవ్వని రంగనాయకమ్మగారి ఇంటర్వ్యూని మొదటిసారిగా ఈ పుస్తకంలో చూడవచ్చు. అదీ ఫోటోతో సహా. ఇంటర్వ్యూ ఇస్తున్నవాళ్ళను రెచ్చగొట్టి వివాదాస్పద వ్యాఖ్యానాలు రాబట్టి సెన్సేషన్ సృష్టించాలనే ధోరణి మాత్రం ఇందులో కనిపించదు. అదే ఈ పుస్తకం గొప్పతనం.

"అక్షరాలు - అనుభవాలు"
(సాహితీప్రముఖుల ఇంటర్వ్యూలు
తెలికపల్లి రవి, సాహితీస్రవంతి,
వెల: రూ.40, పేజీలు:78
ప్రతులకు: అన్ని ప్రజాశక్తి బ్రాంచీలు.

స్వీకారం



కాంగ్రెస్ హయాంలో సంస్కరణలు ప్రారంభం అయ్యాయి. తెలుగుదేశం హయాంలో అవి మూడు మూతలు ఆరు వాతలు అన్నట్లు జనానికి అన్ని విధాలుగా నష్టం కలిగించాయి. సంస్కరణలను అమలు జరపటంలో ఎన్నికల సందర్భంగా ఆవద్ధర్మంగా ఎవరు ఏమాటలు చెప్పినప్పటికీ తరువాత తమ అసలు రూపం బయట పెడుతున్నారు. రాష్ట్రంలో సంస్కరణలు - వాటి దుష్ఫలితాలను స్థూలంగా వివరించేది ఈ చిన్న పుస్తకం.

ప్రజాజీవితాలపై ప్రైవేటీకరణ వేటు
రచన: ఎం. కోటేశ్వరరావు
వెల: రూ. 5/-
పేజీలు: 32/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్



భారత ఆర్థిక వ్యవస్థ
రచన: ఎం. కోటేశ్వరరావు
వెల: రూ. 40/-
పేజీలు: 94/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్

ఇండియన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, సఫ్దర్‌హష్మి మెమోరియల్ ట్రస్ట్ (సహమత్)లు 2004 జులై 5న న్యూఢిల్లీలో సంయుక్తంగా నిర్వహించిన సెమినార్ పత్రాలు ఇవి. నూతనంగా అధికారం చేపట్టిన యుపిఏ ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని (సిఎంపి) ప్రకటించి, తన తొలి బడ్జెట్‌ను ప్రతిపాదించడానికి సిద్ధంగా ఉన్న సమయంలో "కనీస ఉమ్మడి కార్యక్రమం, ఆర్థిక ఎజెండా 2004" పేరుతో ఈ సెమినార్ జరిగింది. అక్కడ సమర్పించిన పత్రాలలో స్పృశించిన అంశాలు కేవలం ఈ ఏడాది బడ్జెట్‌కు మాత్రమే పరిమితమైనవి కావు. ఆర్థిక విధానాలకు సంబంధించిన పలు మౌలికాంశాలను అవి విశ్లేషించాయి.

రమణీయ శిల్పాల రామప్పగుడి

అద్భుత శిల్పకళా శోభితమయినది రామప్ప దేవాలయం. మన రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రాల్లో రామప్పదేవాలయం చెప్పుకోదగ్గదిగా పేరొందింది. ఈ దేవాలయం వరంగల్ జిల్లాలోగల హన్మకొండకు ఈశాన్యాన 65 కిలోమీటర్లు దూరంలో వుంది



యాసలపు సూర్యారావు

పాలంపేట అనే గ్రామానికి కిలోమీటరు దూరంలో రామప్ప దేవాలయం వుంది. అక్కడకు వెళ్ళేందుకు నిత్యం హన్మకొండ నుంచి బస్సులు, జీపులు, ఆటోలు ఉన్నాయి. రామప్ప దేవాలయంలో ప్రాచీన కాకతీయ శిల్పులచే చెక్కబడిన అపూర్వ కళాఖండాలు ఎన్నో ఉన్నాయి. ఎంత చూసినా చూడాలన్పించే ఈ శిల్పకళా నైపుణ్యం అపూర్వం, అద్భుతం. ఆ ఆలయంలో ఎక్కడ చూసిన శిల్పకళా వైభవం ఉట్టిపడుతుంది. రామప్పగుడి (రుద్రేశ్వరస్వామి) మధ్యకాలీన వీరభూమిగా వెలుగొందిన దేవాలయంగా ఖ్యాతిగాంచింది. పెద్దపెద్ద శిలా ప్రాకారాల మధ్య భాగాన నిర్మించబడిందీ దేవాలయం. శిల్పకళా శోభితమైన ఈ ఆలయ నిర్మాణం కాకతీయ శిల్పుల కళా నైపుణ్యానికి అద్దం పడుతుంది. తూర్పు ముఖం కలిగి ఉంది. కోణాకృతిలో నిర్మితమైన రామప్పగుడి ముందు భాగాన అంతరాళం కలదు. ఆలయంపై "కనాసి" కప్పు, విమానకం కలదు. ఈ ఆలయంలో అదే వరుసలో శిఖరపు మూడవ భూమి వరకూ నిర్మింపబడి శిఖరపు ఔన్యత్యాన్ని ఇనుమడింపచేస్తోంది. ఈ ఆలయంలో అనేక శిల్పాలు నాట్యకళా సంస్కృతులకు దర్పణంగా నిలుస్తాయి. గుడి చుట్టూ గల ప్రాకారాల్లో అనేక భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను కళ్ళకు కట్టారు. ఆలయ ముఖద్వారం ముందు వెలసిన నంది మండపం మహాద్భుతం అనకతప్పదు. ఆ నందీశ్వరుని శిల్పి తన ఉలితో మలచిన తీరు అబ్బుర పరుస్తుంది. ఈ నందిని శిల్పి తన ఉలితో మలచిన తీరు ఎంత గొప్పదో చెప్పనలవిగాదు. నంది శరీరంపై గల నరాలను కూడా చూపరులకు కనిపించే విధంగా, జీవం ఉట్టిపడే విధంగా మలచాడు శిల్పి. ఆలయం చుట్టూ అనేక ప్రఖ్యాత చిత్రాలను నల్లరాతితో నర్తకి, మదనిక, నాగిని వంటి అనేక శిల్పాలను రమణీయంగా మలిచి ఆలయం పైకప్పు అంచుల వద్ద అమర్చారు. ఆలయానికి ఇరువైపులా పచ్చదనంతో ప్రకృతి అందాలు మనోల్లాసాన్ని కల్గిస్తాయి. ఆలయం చుట్టూగల అందమైన అనేక కట్టడాలు మనకు కనువిందు చేస్తాయి. గర్భగుడి అంతరాలకు గల ద్వార శాఖలలో శిల్ప శోభితమయిన పూదివ్వెలు, పూదివ్వెల నడుమ నాట్యమాడు నర్తకీమణులు, హంసల జంటలు ద్వారంపై మకర తోరణాలు ఏకశిలపై అపురూపంగా మలచబడ్డాయి. ద్వారంపై గల గుమ్మాలను ఏకశిలతో చెక్కడమే కాకుండా వాటిపై శిల్పులు కనపర్చిన శిల్పకళా నైపుణ్యం అపురూపం. ఇవియేగాక ద్వారపాలకులు, మురళీధర కృష్ణుడు, గోపికావస్త్రాపహరణం, ఇంకా అనేక శృంగార శిల్పాలు శిల్పకళా నైపుణ్యానికి అద్దం పడతాయి. రామప్పగుడి ప్రాంగణానికి వాయవ్య దిశగా అమ్మవారి ఆలయం, నైఋతి దిశగా యోగ నరసింహస్వామి వారి ఆలయాలున్నాయి. ప్రాచీన ప్రాకార దక్షిణ ద్వారం వద్ద త్రికూట ఆలయాలు కూడా కలవు. ఇంతటి అద్భుత కళాసంపద కలిగిన ఈ రామప్ప దేవాలయం మొత్తంగా పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మిగిలిపోయింది అనవచ్చు. విలువ కట్టజాలని ఈ కళాసంపధ ఎంతటి నిర్లక్ష్యానికి గురవుతున్నదో మనకు ఇక్కడ కన్పిస్తుంది. ఈ మహోన్నత శిల్పకళా సంపదను రక్షించుకునేందుకు అటు పర్యాటక రంగంవారు గానీ, ఇటు పురావస్తుశాఖవారు గాని తగిన శ్రద్ధను కనబర్చటంలేదన్నది ఈ రామప్పదేవాలయాన్ని సందర్శించిన వారికి ఇట్టే అర్థం కాగలదు. ఆలయం చుట్టూ గల ఖాళీ ప్రదేశాల్లో ఇప్పుడు అందమైన మొక్కలు పెంచటం జరుగుతోంది. అక్కడకు వెళ్లిన యాత్రికులకు తగిన సౌకర్యాలు సైతం అక్కడ లేవు. అక్కడ గల మరో దేవాలయం పూర్తిగా శిధిలమయింది. ఇప్పటికైనా పాలకులు ఇలాంటి అద్భుత కట్టడాల యెడల తగినంత శ్రద్ధను కనపర్చినట్లైతే రామప్పగుడి నిత్యం వందలాది మంది యాత్రికులు, భక్తులతో కళకళలాడగలదు. అనేక మందికి ఉపాధి కల్పించగలదు. ✤



'రచన'కు ప్రశంసే అత్యుత్తమ పురస్కారం

రచయిత్రిగా, కవియిత్రిగా, వక్తగా డా॥వాసా ప్రభావతి పేరు తెలుగు సాహిత్య రంగంలో ప్రఖ్యాతి గాంచిన పేరు. వివిధ పత్రికలలో వేయికి పైగా కవితలు, 80 కథలు ప్రచురింపబడటంతోపాటు, 12 కవితా సంపుటాలు, 3 కథా సంపుటాలు, నవలలు, వచన కావ్యాలు వెలువడ్డాయి. వీరి రచనలు పాఠ్యగ్రంథాలుగా కూడా ఎన్నికవ్వటం విశేషం వీరి రచనలు అనేకం ఇతర భాషలలో సైతం అనువదింపబడి తెలుగు 'భాష' యొక్క విశిష్టతను ఇతర భాషలలో ఇనుమడింపచేసారు. వాసా ప్రభావతి ఫిలిం సెన్సార్‌బోర్డ్ మెంబరుగా ప్రాతినిధ్యం వహించారు. లెక్కకు మించిన సత్కారాలు, పురస్కారాలు అందుకున్న 'రచయిత్రు'లలో వాసా ప్రభావతి ఒకరు.

చలపాక ప్రకాష్

తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపుర గ్రామంలో 1941లో ప్రముఖస్వాతంత్ర్య సమరయోధులు కాశీచయనుల సూర్యనారాయణ, లక్ష్మీదేవమ్మ దంపతులకు జన్మించారు ప్రభావతి. ఆత్రేయపురంలోనే ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకుని వివాహమైన తదుపరి హైదరాబాద్‌లో ఉన్నతవిద్యను అభ్యసించారు. ఉస్మానియా యూనివర్శిటిలో ఎమ్.ఎ. తెలుగు, ఆంధ్ర సాహిత్యంలో హరిశ్చంద్రోపాఖ్యానముపై పి.హెచ్.డి. డిగ్రీ, పి.జి. డిప్లొమా ఇన్ లింగ్విస్టిక్స్ డిగ్రీలు సాధించారు. ప్రత్యేక 'తెలుగు' పై తన మక్కువను చాటుకున్నారు. సరోజినీనాయుడు వనితా మహావిద్యాలయంలో తెలుగులెక్చరర్‌గా చేరి, రీడరుగా, తెలుగు శాఖాధ్యక్షులుగా పని చేశారు. ఇటు విద్యార్థుల చేత, అటు ప్రముఖ సాహితీమూర్తులు, గురువులు అయిన అచార్య దివాకర్ల వెంకటావధాని, ఆచార్య సి. నారాయణరెడ్డి తదితర ప్రముఖుల, ప్రశంసలందుకున్నారు. ప్రభుత్వ ఇతర సంస్థల చేత 'ఉత్తమ ఉపాధ్యాయిని'గా పురస్కారాలు, మన్ననలు పొందారు.

హైస్కూలులో చదువుకునే రోజుల నుండే ప్రభావతి వ్యాసరచన, వక్తృత్వపు పోటీలలో అనేక బహుమతులందుకున్నారు. యూనివర్సిటిలో కూడా వివిధ పోటిలలో బహుమతులు సంపాదించుకున్నారు. అనేక సభావేదికలపై 'ఉత్తమ వక్త' గా పేరు గడించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆధునిక సాహిత్యంపైన మహిళాసమస్యలపై అనర్గళ ఉపన్యాసాలు చేసి ఎందరో మన్ననలను అందుకున్నారు.

వేయికిపైగా కవితలు రాసిన ప్రభావతి ఆ కవితలకు సంపుటాలుగా సంకలనపరిచారు. "అమ్మ", "ఆలాపన", "జగతి-ప్రగతి", "మానవతా శిఖరం", "వెలుగువచ్చు వేళ", "స్నేహ సుమాలు", "మంజీర నాదాలు", "కాటుక కంటినీరు", "హృదయనేత్రి", "మళ్ళీ మళ్ళీ పుడతా", "స్వర్ణ భారతి", "ఓ ఉదయం". వంటి 12 కవితా సంపుటాలు వెలువరించారు. వీటిలో అనేక కవితలకు, కవితాసంపుటాలకు వివిధ సంస్థలచే బహుమతులు, అవార్డులు ఎన్నో లభించాయి. అనేక వేదికలపైన దూరదర్శన్, ఆకాశవాణిలలో అనేక కవితలు, కవిసమ్మేళనాలలో పాల్గొని పలువురి ప్రశంసలు, సత్కారాలు పొందారు. ఆకాశవాణి కేంద్రం నుంచి జాతీయ కవిసమ్మేళనం అనువాద కవయిత్రిగా పాల్గొనటం ఇక్కడ చెప్పుకోతగ్గ మరో ప్రత్యేక విశేషం.

80 కథలు రచించగా వాటిలో "న్యాయం గుడ్డిది", ''సంధ్య అంచున'', ''సిలకమ్మ'' పేర్లతో కథాసంపుటాలుగా వెలువడి పలువురి ప్రశంసలు అందుకున్నాయి. వివిధ పత్రికలు, సంస్థలు నిర్వహించిన కథల పోటీలలో అనేక బహుమతులు కైవసం చేసుకున్నాయి. మరికొన్ని కథలు తమిళ, కన్నడ, ఆంగ్ల భాషలలో అనువాదమయ్యి ఇతర భాషలలో సైతం ప్రభావతి గారికి అభిమానులను సంపాదించిపెట్టాయి.

అదేవిధంగా వీరు రాసిన నవలలు వివిధ పత్రికలలో సీరియల్స్‌గా ప్రచురించారు. పాఠకుల ఆదరణ లభించటంతో అవి నవలలుగా కూడా వెలుగు చూసాయి. వీరి రచనలలో ఎక్కువగా పల్లెజీవనం, స్త్రీ పాత్రల చిత్రణ అధికంగా, ప్రత్యేకశైలిలో నడవటం, మాండలిక పరిభాషలో సాగుతాయి. ఈ ప్రశంసలు అందుకోగా, త్వరలో నవలలు వెలువర్చనున్నట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

పరివర్తన, ఇదేమన కర్తవ్యం, తరం మారింది. మీరూ మీరూ ఒక్కటే, ఏకాంకికలు, "పరివర్తన" పేరుతో వెలువడగా, మగ పాత్రలు లేని ఏకాంకిక కాలేజి విద్యార్థినుల చేత ప్రదర్శింపబడి అనేకసార్లు బహుమతులు అందుకోవటం విశేషం. అన్నిటికంటే

కొన్ని ప్రశ్నలు

అవును మిత్రమా
ఇంతకీ
మన ఈ జీవితాన్ని
ఎవరు స్పాన్సర్ చేశారు?
ఈ బతుకు
సీరియల్లో
అన్నీ కన్నీళ్ళు కష్టాలేనా?
ఈ పెట్టె నిండా
రంగులే..
మన బ్రతుకేమిటి
బ్లాక్ అండ్‌వైట్?
ఇపుడు
ప్రపంచమే ఒక ప్రాయోజిత కార్యక్రమం
ఎవరి ప్రయోజనం కోసం?

ప్రకటనలు
అప్రకటిత కోర్కెల రేసుకోర్సులా?
కేబుల్
ఇన్
ఇంటి - చైనాషాపా?
రోజుకి
ఇరవై నాలుగు గంటలా
ఇరవై నాలుగు సినిమాలా?
నిరంతర ప్రసారం
నిద్రే అంతరాయమా?
ఇన్ని ఛానళ్ళిచ్చి
ఓరి దేవుడో
రెండే కళ్ళిచ్చావేంటి?

- ఎస్. హనుమంతరావు

ముఖ్యంగా వీరు స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా రచించిన "దేశబాంధవి" నాటకం అనేక సార్లు ప్రదర్శింపజేశారు. "స్వాతంత్ర్య పోరాట మహిళా వీరగాథ" ప్రఖ్యాతి వహించిన ప్రముఖుల, రాష్ట్ర మంత్రుల ప్రశంసలూ అందుకున్నారు. ఈ సందర్భంలో ప్రముఖ సాహితి, సాంస్కృతిక సేవాసంస్థ "రోగ సప్తస్వరమ్" వారిచే వాసాప్రభావతికి బంగారు కంకణం ప్రధానం చేయటం రచయిత్రిగా ఆమె విశిష్టతకి తార్కాణంగా పేర్కొనవచ్చును.

1986లో రష్యాలో పర్యటించి రష్యాలో స్నేహయాత్ర, వచన కావ్యం మధురమైన, అత్యద్భుత శైలిలో రాసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. రావూరి వెంకట సత్యన్నారాయణ గారి జీవిత చరిత్రపై రచించిన గ్రంధకావ్యం, మహిళాసమస్యలపై రచించిన "చైతన్యస్రవంతి", స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖ మహిళల జీవిత చరిత్రలతోపాటు వారి ఇంటర్వ్యూలతో రచించిన 'స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ మహిళలు' గ్రంథం మిక్కిలి ప్రచారం పొందాయి. "స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు" గ్రంధానికి తెలుగు యూనివర్సిటీ వారు "రచయిత్రి ఉత్తమగ్రంధం" అవార్డు లభించింది. 'భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగుమహిళల పాత్ర" అనే 450 పేజీలతో ఒక పుస్తకం ప్రచురించారు.

వాసా ప్రభావతి అనేక జాతీయ అంతర్జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొని మహిళల చైతన్యంపై తెలుగు సాహితి, ప్రక్రియలపై అనేక ప్రసంగాలు చేసారు. వారి దగ్గర ఎందరో విద్యార్థినీ విద్యార్థులు ఎమ్.ఫిల్. పి. హెచ్. డి డిగ్రీలు పొందారు.

"సంఘం చేసిన భిక్షుకి" "నాటిక, "న్యాయం గుడ్డిది," కథల సంపుటి మైసూరు యూనివర్శిటీలో 1990-93 వరకు బి.ఏ, బి.ఎడ్, వారికి పాఠ్య గ్రంధాలుగా ఎన్నికైనాయి. ప్రాంతీయ (తెలుగు) ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబరుగా పన్నెండు సంవత్సరాలు పనిచేసి ఉత్తమ విమర్శకురాలిగా వాసా ప్రభావతి చక్కని పేరుని నిలుపుకున్నారు.

అలాగే వీరు చేసిన కృషికి అనేక బిరుదులు లభించినా వీటిని ఎక్కడా వాడుకోని నిరాడంబర సాహితీమూర్తి ఆమె. సాహిత్య శ్రీ, భారత భాషా భూషణ్, సాహిత్య శిరోమణి, సాహితీ సరస్వతి, అక్షర కంఠీరవ వంటి ఎన్నో బిరుదులు లభించినా ఆమెకు ఈ బిరుదులు ఇచ్చినట్లు ఆ సంస్థలు ప్రచారం చేసుకోవల్సిందేగాని ఆమె మాత్రం ఆ బిరుదులను ఎక్కడా వినియోగించినట్లు కనబడదు.

అనేక కథా, కవితా, పద్యకవితా, నవలలకు ముందుమాటలు రాసినా, ఆటా సభలలో రెండుసార్లు పాల్గొన్నా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో "లెక్కకు మించిన" పురస్కారాలు సన్మానాలు, అభినందనలు అందుకున్నా, ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించినా, చెక్కుచెదరని నిరాడంబరతతో అందరిలో ఒకర్తిగా ఓ సామాన్యురాలిగా కలిసిపోయే సహృదయరాలు. ఉన్నత ఆశయాలు, ఆదర్శాలు గల ఉత్తమ రచయిత్రిగా వాసా ప్రభావతి పాఠక లోకంలో చిరస్థాయిగా నిల్చిపోగలరని ఆశిద్దాం. ✤

సురాపాన సునామీ

ఎండుకుపోతున్న గొంతు తడపటానికి
గుక్కెడు మంచి నీళ్లకు... కరువు
ఆకలి రసాయన చర్యను
అదుపులో పెట్టడానికి బుక్కెడు బువ్వ... కరువు
బతుకుబండి కాడి విరగకుండా
పిల్లల పసితనపు ఆనందాలు పండించడానికి
కదులుతున్న చేతులకు
ఉపాధి... కరువు
వేగుచుక్క పొడిచిందగ్గర్నుంచీ
పనులఉనికిని పరిశోధిస్తూ
పరుగులు తీసి అలసిపోయిన శరీరాలకు
ఆసరా ఇచ్చేగూడు... కరువు
గువ్వల్లా గునగునలాడుతూ
బడిలో కాలుపెట్టాలనుకునే ఆశలపూవులకు
చదువు... కరువు
ఆకలి వైరస్ తెచ్చిపెట్టే అనారోగ్యానికి
విరుగుడుగా పనిచేసే ఆరోగ్య సేవలకు... కరువు.
"ప్రజలకోసం- ప్రజల నడుమ- ప్రజలచేత" ఉండాల్సిన అన్నింటికీ
కరువు - కరువు...
కరువుకు ఉపశమనంగా
గట్టెక్కించే అమృత హస్తమౌతానన్న స్వామ్యం
మందును పుష్కలావర్త మేఘాలుగా కురిపించి
కరువులేకుండా చేసి
ఓహో... సంక్షేమానికి తిరుగులేని పరిష్కారం
చూపింది!
కంట్రాక్టర్ల ఖండ ఫలకాలతో
మద్య సునామీ అలలను సృష్టించి
ఎక్సైజు ఆదాయాన్ని సుదర్శన చక్రంగా
ప్రయోగించి
సంక్షేమ ప్రపంచబ్యాంకును తెరిచింది.
బారులు తీరనున్న బార్ల పట్టాల పంపిణీ
చీప్‌లిక్కరు చిన్మయానందలాస్యం
బెల్టుషాపుల అడ్డుగోడ కాపలా
'చేతి' చలువలకు విలువలు పెంచడమే.
పరిపూర్ణ ఆరోగ్య మద్య సంవిధాన విధానంతో
పల్లెపంట పచ్చదనాలకు మిగిలేది తలాఖేం
పానశాలల పత్రహరిత సంపద సతతహరితమే
మత్తు స్పీడోమీటర్లు
రహదార్లంతా నెత్తుటి చిందులాటలు
వేయించటమే
ఇకనుంచి... రోడ్లరక్త బీభోత్సవం
జనాభా నియంత్రణకు భద్రతాపాలసీలే
సంక్షేమ మద్యప్రవాహ సంగీతం
ప్రజాస్వామ్య తుంబుర గానమే.

-వల్లభాపురం జనార్థన

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

మీరున్నంతవరకూ హక్కుదార్లే

నాకు మా అమ్మగారు రాసి ఇచ్చిన స్థిరాస్థి ఉంది. నా తదనంతరం నా సంతానానికి చెందునట్లు వీలునామా రాసి రిజిష్టర్ చేసి వున్నది. స్థిరాస్థిని నేను అమ్ముకునే హక్కులేదు. నాకు రెండు సంబంధాలు. ఎవరు నాకు ధన సహాయం చేయరు. పిడికెడు మెతుకులు పెట్టరు. నా రెండవ భార్య వుండటానికి కూడా వీలు లేదుఅంది. అప్పట్లో అపరాలు, కందులు, పెసలు, శనక్కాయ వగైరా కొనుక్కొని వాటిని లాభానికి అమ్మి సంపాదించిన సొమ్ముతో ఖాళీ స్థలం కొని ఖమ్మంలో మూడు గదుల డాబా ఇల్లు కట్టుకొన్నది. మగ, ఆడ ఇద్దరు సంతానం. అందరికి పెళ్ళిళ్ళు చేసింది. నాకు ఇప్పుడు డబ్బై సంవత్సరాలు. నా భార్యకు 60 సంవత్సరాలు. పెద్దమనుషులు చిన్నవాడు, అతని భార్య బైటికి పోవాలంటే రు.40,000లు ఇచ్చి సంతకాలు పెట్టించుకోవాలన్నారు. అలానే చేస్తే 3 నెలల తర్వాత గది తాళం పగులగొట్టి మళ్ళీ ప్రవేశించాడు. పోలీసులకు చెబితే సరైన న్యాయం చేయలేదు. పై వారందరు కుమ్మక్కై బాధలు పెడుతూ వుంటే ఎస్.పి.గారితో చెప్పుకొన్నాను, కావున నేను ఏం చేయాలి నా ఆస్తి నాకు వచ్చేటట్లు ఏం చేయాలి.

బొమ్మిడి వీరభద్రం, జగ్గయ్యపేట

మీ అమ్మగారు వ్రాసిఇచ్చిన విల్లు ప్రకారం మీరున్నంతవరకు ఆమె అస్తిని అనుభవించే హక్కు మీకే ఉంది. కాబట్టి అనుభవించవచ్చు. మీ రెండవ భార్య సంపాదన అది మీ దంపతుల ఇరువురి కష్టార్జితం. మీ పిల్లలకు దానిమీద ఎటువంటి హక్కులు ఉండవు. మిమ్మల్ని ఇబ్బందిపెట్టి వారి అధీనంలోకి తీసుకుంటే, పోలీసు వాళ్ళు సహాయం పొందలేకపోతే కోర్టువారిని సంప్రదించండి. మెజిస్ట్రేటుగారి వద్ద దురాక్రమణ కేసుగాని, వారిని ఖాళీ చేయించుటకు దావాగాని వేయవచ్చు. దగ్గరలోని న్యాయవాదిని సంప్రదించండి తప్పక న్యాయం జరుగుతుంది.

కంపాసినేషన్ గ్రౌండ్స్

నా తండ్రి ఎన్. వెంకటేశ్వర్లు రైల్వేలో డిపార్ట్‌మెంట్‌లో వెల్‌ఫేర్ ఇన్‌స్పెక్టర్ గారు. మేము నివసించుస్థలము నర్సరావుపేటకు వెరిఫికేషన్ నిమిత్తం రిపోర్ట్ వ్రాసుకొని పోవడమే తప్ప మాకు ఎటువంటి ఉద్యోగం ఇవ్వలేదు. తరువాత రైల్వే అథారిటీవారు నా తండ్రిగారు ఎన్.వెంకటేశ్వర్లుకి రెండవభార్య ఉంది అని చెప్పినారు. నా తండ్రిగారు జబ్బుమనిషి అయితే రెండవభార్య ఎలా వచ్చింది? మా తండ్రిగారు చనిపోయిన దగ్గర నుండి ఇప్పటివరకు నెలసరి పెన్షన్ వస్తూనే ఉంది. కాని రైల్వే అథారిటి వారు ఈ తప్పుడు సమాధానం చెప్పడం న్యాయబద్ధంగా లేదు. ఈ విషయం గురించి మేము ఏమి చేయాలి?

ఎన్. భారతీదేవి

నరసరావు పేట

రైల్వేవారు మీ నాన్నగారికి రెండవ భార్య ఉంది అని చెప్పారంటున్నారు. అంటే మీ ఉద్దేశ్యం రెండవభార్య లేదు అనేగా కాంపాసినేటివ్ గ్రౌండ్ కింద మీ కుటుంబసభ్యులందరి ఆమోదంతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించమని మీరు దరఖాస్తు చేసుకున్నారా? లేదా తెలుపలేదు. డిపార్టుమెంటులో పై అధికారుల్ని కలిసి న్యాయం చేయమని అడగండి. వారిలో స్పందన లేకుంటే సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హైద్రాబాద్ అప్లికేషన్ పెట్టుకోండి. తప్పక న్యాయం జరుగుతుంది.

మిల్లుమూత-కార్మికుని హక్కులు

మా నాన్నగార్కి అజాంజాహి మిల్స్ లో టెంపరరీ ఉద్యోగము. 1996లో ఆ మిల్లుమూత పడింది. అప్పటి నుండి పని నడవలేదు. అటెండన్స్ మాత్రమే 4 సంవత్సరాలు రెగ్యులర్‌గా (2000సం॥లో వరకు) నడిచింది. అయితే ఆర్థిక ఇబ్బందులవల్ల 2000సం॥లో రిజైన్ చేసినాడు. అప్పుడు 70వేల రూపాయలు మాత్రమే వచ్చినాయి. పించను నెలనెల 120 రూపాయలు మాత్రమే వస్తున్నాయి. 2002 సం॥ లో పర్మినెంట్ మరియు టెంపరరీ ఉద్యోగాలు రిజైన్ చేసిన వాళ్ళకు వీళ్ళకు సరిసమానముగా 3 లక్షల రూపాయలు ఆపైన మరియు 700 రూపాయల పించను వస్తుంది. మొదటే రిజైన్ చేసిన వాళ్ళకు మరియు వీళ్ళకు ఒకటిన్నర సంవత్సరాలు తేడా వుంది. మొదట రిజైన్ చేసిన ఉద్యోగులు 300 మందికి పైన ఉన్నారు. వీళ్ళందరు కోర్టులో కేసు వేసి 2 సం॥రాలు పూర్తయింది. అయినా ఎటువంటి న్యాయము జరుగుట లేదు. మా నాన్నగార్కి మరియు మిగతా కార్మికులకు న్యాయము జరుగుతుందా. లేదా. అలాగే పించను పెరిగే అవకాశాలున్నాయా? ఒక వేళ పెరగాలంటే ఏమి చేయాలి? ఇంకా ఎంత సమయం పట్టవచ్చు? తెలుపగలరు.

ఒక సోదరుడు

జఫర్‌గడ్ మండలము, వరంగల్ జిల్లా.

మీరు ఈ పాటికే న్యాయస్థానంలో దావా వేశానన్నారు. కాబట్టి మీ న్యాయవాదిగారిని సంప్రదిస్తూ కేసు త్వరగా అయ్యేటట్టు చేసుకోండి.

పాల బూరెలు

కావలసిన వస్తువులు:

బియ్యం	:	కిలో
బెల్లం	:	కిలో
నూనె	:	కిలో
పాలు	:	సరిపోయినన్ని
ఏలకులు	:	పది

తయారు చేసే విధానం: బియ్యం రెండు గంటలు నానబెట్టాలి. బియ్యం వడేసి పిండి కొట్టి జల్లించుకోవాలి. ఆ పిండిలో బెల్లం తరిగి కలపాలి. ఏలకులు పొడి కొట్టి కలపాలి. నీళ్ళు పోయకుండా పాలు పిండిలో పోసి కలుపుకోవాలి. పిండి గరిటె జారుగా ఉండాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగాక ఈ పిండిని గరిటెతో బూరెలు లాగా పోయాలి. ఇవి బాగా పొంగుతాయి. ఒకటి పైకి పొంగిన తరువాత రెండోది పోయాలి. లేకపోతే అన్నీ కలిసిపోతాయి. వీటిని బాగా వేగనిచ్చి తీసివేయాలి. ఇవి మెత్తగా లోపల పొరలుపొరలుగా వచ్చి తినడానికి చాలా రుచిగా ఉంటాయి. వారం రోజులు నిల్వ ఉంటాయి.

బ్రెడ్ దోసె

కావలసిన వస్తువులు:

బ్రెడ్ పొడి	:	ఒక కప్పు
మైదా	:	అర కప్పు
బొంబాయి రవ్వ	:	అర కప్పు
చిక్కని మజ్జిగ	:	ఒక కప్పు
సిమ్లా మిర్చి ముక్కలు	:	అర కప్పు
క్యారెట్ తురుము	:	అర కప్పు
పచ్చి మిరపకాయలు	:	తగినన్ని
జీలకర్ర	:	అర టీ స్పూన్
పంచదార	:	అర టీ స్పూన్
నూనె	:	తగినంత
ఉప్పు	:	ఒక టీ స్పూన్

తయారు చేసే విధానం: బ్రెడ్‌పొడి, మిగిలిన పదార్థాలన్నింటినీ కలిపి మజ్జిగ కూడా పోసి దోసెల పిండిలా కలపాలి. ఈ పిండిని పెనంపై పల్చగా వేసి కాల నివ్వాలి. మనకు నచ్చిన చట్నీతో లేదా సాస్‌తో తిన వచ్చు. బ్రెడ్ ఇంట్లో ఉండిపోతూ ఉంటుంది. ఆ బ్రెడ్ ముక్కలను ఎండలో పెట్టి బాగా ఎండిన తరువాత మిక్సీలో వేసి పొడిచేసి రెడీగా పెట్టుకోవాలి. ఈ బ్రెడ్ దోసెలను పిల్లలు ఇష్టంగా తింటారు.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:
కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : గుగులోతు కిషన్
వయసు: 13 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: చదవడం, రాయడం, పాటలు పాడడం, క్రికెట్ ఆడడం.
లక్ష్యం: టీచర్ కావడం.
చిరునామా:
గుగులోతు కిషన్,
సన్నాఫ్ జగ్న, తండా సర్పంచ్,
నెల్లికుదురు (మం), వరంగల్ జిల్లా.

పేరు : షేక్ నూర్జహాన్
వయసు: 9 సం॥
చదువు: 4వ తరగతి
హాబీలు: చదవడం, ఆటలు ఆడడం, టీవీ చూడడం, అల్లరి చేయడం.
చిరునామా:
షేక్ నూర్జహాన్,
డాటరాఫ్ షేక్ పెద్ద వలి,
షాదీఖానా దగ్గర, యర్రగొండపాలెం.
ప్రకాశం జిల్లా. **పిన్:** 523 327.

పేరు : షేక్ హుస్సేనా బేగం
వయసు: 12 సం॥
చదువు: 7వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం.
చిరునామా:
షేక్ హుస్సేనా బేగం, కేరాఫ్ డా॥ షేక్ వలీ సాహెబ్, డేవిడ్ మేరీ బాలికల ఉన్నత పాఠశాల, యర్రగొండపాలెం,
ప్రకాశం జిల్లా. **పిన్:** 523 327.

పేరు : గట్టుపల్లి సాయి
వయసు: 13 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: కవితలు రాయడం, బొమ్మలు గీయడం.
చిరునామా:
గట్టుపల్లి సాయి,
సన్నాఫ్ జి.ఎల్.ఎల్.ప్రసాద్,
పామూరు (పోస్ట్),
ప్రకాశం జిల్లా. **పిన్:** 523 108.

పేరు : కొట్యాడ అప్పలరాము
వయసు: 15 సం॥
చదువు: 10వ తరగతి
హాబీలు: వార్తలు చదవడం, డ్రాయింగ్ వేయడం, పాటలు పాడడం.
చిరునామా:
కొట్యాడ అప్పలరాము,
సన్నాఫ్ వేమాలు,
ఎం.సింగవరం,
వేపాడ (మం), విజయనగరం జిల్లా.

పేరు : ముత్యాల తేజగౌడ్
వయసు: 10 సం॥
చదువు: 4వ తరగతి
హాబీలు: పుస్తక పఠనం, క్యారమ్స్, చెస్ ఆడడం.
స్కూలు: శ్రీ విద్యాలయ పబ్లిక్ స్కూల్
చిరునామా:
ముత్యాల తేజగౌడ్,
ఉరుగొండ (పోస్ట్ & గ్రా),
ఆత్మకూర్ (మం), వరంగల్ జిల్లా.

పేరు : హుమేరా ఫిర్దౌస్
వయసు: 11 సం॥
చదువు: 7వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, అల్లరి చేయడం, డ్రాయింగ్ వేయడం.
లక్ష్యం: ఇంజనీర్/డాక్టర్ కావడం.
చిరునామా:
హుమేరా ఫిర్దౌస్, డాటరాఫ్ సయ్యద్ ఇసాక్, 7వ తరగతి, ఇఖ్రా మోడల్ స్కూల్, కోటగిరి, నిజామాబాద్ జిల్లా. **పిన్:** 503 207.



పేరు : బిరుదుల ప్రవీణ్‌కుమార్
వయసు: 15 సం॥
చదువు: 8వ తరగతి
స్కూలు: శ్రీ వివేకానంద విద్యాలయం
హాబీలు: మహోత్మల జీవిత చరిత్రలు, జి.కె. చదవడం, కలంస్నేహం చేయడం, జాతీయ గీతాలు పాడడం, చెస్ ఆడడం.
చిరునామా:
బిరుదుల ప్రవీణ్‌కుమార్, సన్నాఫ్ ధర్మయ్య, హౌస్ నెం.5-8, ఆంధ్ర కాలనీ, ఉట్నూర్, లక్సెట్టిపేట (మం), ఆదిలాబాద్ జిల్లా. **పిన్:** 504 215.